గురుకుల కళాశాల విద్యార్థిని మృతి.. బంధువుల ఆందోళన

■ లోపలి పేజీలో..

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 11 జూలై 2025

రుద్రమ్మకోట వద్ద పెరిగిన గోదావరి నీటిమట్టం



గోదావరికి వరదపోటు

పునరావాస కాలనీలకు తరలివెళుతున్న నిర్వాసితులు

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగు తోంది. గోదావరి ఎగువ భాగన మహారాష్ట్రతో పాటు తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా క్రమంగా గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. భద్రాచలం వద్ద గురువారం సాయంత్రం ఆరు గంటలకు గోదావరి నీటిమట్టం 26 అడుగులకు చేరింది. శుక్రవారం ఉదయానికి 32 అడుగులకు చేరుకుని శనివారానికి మొదటి ప్రమాదహెచ్చరిక 43అడుగులకు చేరుకోవచ్చని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో కుక్కునూరు మండ లంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామా లకు స్థానికాధికారులు వెళ్లి నిర్వాసితులను అప్రమత్తం చేస్తున్నారు. గొమ్ముగూడెంకు చెందిన పది నిర్వాసిత కుటుంబాలు దాచారం పునరావాస కాలనీకి తరలి వెళ్లారని, లచ్చి గూడెం గ్రామస్థులను కూడా దాచారం పునరావాస కాలనీకి తరలిరావాలని సూచించినట్టు తహసీల్దార్ రమేశ్‌బాబు తెలిపారు. వేలేరుపాడు మండలంలోని రేపాక గొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, రుద్రమ్మకోట, గ్రామాల ప్రజలు ఇప్పటికే కొన్ని కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలిపోగా మిగిలిన వారు ఆ ప్రయత్నంలోనే ఉన్నారు. కాగా పునరావాస కాలనీల్లో మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి అవసరాల కోసం ట్యాంకుల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం కల్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.



కుక్కునూరు తీరంలో గోదావరి ఉధృతి

కుక్కునూరు, వేలేరుపాడులకు ప్రత్యేకాధికారులు

ఏలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద పునరావాస కార్యక్రమాల నిర్వహణకు మండల ప్రత్యేకాధికారులను నియమించారు. వేలేరుపాడుకు డీఆర్‌డీఏ పీడీ విజయ రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జితేంద్ర, కుక్కునూరుకు జడ్పీ సీఈవో శ్రీహరి, జిల్లా సర్వే/ల్యాండ్ రికార్డ్సు అధికారి అన్సారీలను నియమించినట్టు తెలిపారు.

పరుపుల తయారీ పరిశ్రమ దగ్ధం.. కోట్లలో ఆస్తి నష్టం



■ లోపలి పేజీలో..

మెగా పీటీఎం.. గ్రాండ్ సక్సెస్



పెయ్యేరు పాఠశాలలో తల్లులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

- రికార్డుస్థాయిలో పేరెంట్స్ హాజరు
- టీచర్లు, అధికారుల్లో రెట్టింపు ఉత్సాహం
- గిన్నిస్ రికార్డుకు జిల్లా నుంచి నూరు శాతం భాగస్వామ్యం
- 2,227 పాఠశాలలు, 140 జూనియర్ కళాశాలల్లో నిర్వహణ

ఏలూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ (పీటీఎం 2.0) విజయవంతమైంది. ఈ కార్య క్రమంలో భాగంగా విద్యార్థుల చదువు చర్చతో పాటు తల్లులకు మ్యూజికల్ చైర్, ముగ్గుల పోటీలు వంటి క్రీడలు నిర్వహించి ప్రతిభ కన బర్చిన వారికి బహుమతులను అందించారు. వీటితోపాటు చిన్నారులు గ్రూప్ డ్యాన్సులు, పాటలు పాడడం ఆకర్షణగా నిలిచాయి. పూర్వ విద్యార్థులు హాజరై వారు ఆయా పాఠశాలల్లో సాధించిన ప్రతిభను తెలపడంతో పాటు ఏ లక్ష్యంతో ముందుకు సాగాలన్నది సూచనలు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 2,227 పాఠశాలలు, 140 జూనియర్ కళాశాలల్లో జరిగిన పీటీఎం కార్యక్రమాలు విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఇంటర్ బోర్డు సమష్టి కృషితో నూరు శాతం సత్ఫలితాల నిచ్చాయని సంబంధితశాఖల జిల్లా అధికారులు వెంకటలక్ష్మమ్మ, పంకజ్‌కుమార్, యోహాన్, శేఖర్‌బాబు ప్రకటించారు. జిల్లా కేంద్రానికి గురువారం రాత్రి 9 గంటల వరకు అందిన సమా చారం ప్రకారం 1,506 పాఠశాలల్లో మొత్తం 78,104 మంది తల్లులు, 49,662 మంది తండ్రులు, 1,789 మంది సంరక్షకులు కలిపి మొత్తం 1,29,555 మంది పేరెంట్స్ పీటీ ఎంలో పాల్గొన్నట్టు అధికారికంగా ప్రకటించారు. కాగా ఈ పాఠ శాలల నుంచి 7,275 మంది టీచర్లు హాజరు కాగా, బాల బాలికలు 2,23,661 మంది పాల్గొన్నారు. వీరితోపాటు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్లు, సభ్యులు మొత్తం 17,297మంది హాజర య్యారు. ఆయా పాఠశాలల పూర్వవిద్యార్థులు 1,888 మంది, దాతలు 1,788 మంది హాజరు కావడం విశేషం. స్థానిక ప్రజా ప్రతినిధులు 2,176 మంది, అధికారులు 1,754 మంది, స్థాని క ప్రముఖులు, మేధావులు, ఆహ్వానిత సభ్యులు 2,538 మంది, ఇతరులు 39,857 మంది పాల్గొన్నారు. మిగతా పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి పూర్తి సమాచారం శుక్రవారం వస్తుందని విద్యాశాఖవర్గాలు తెలిపాయి.



దెందులూరులో తల్లులతోపాటు కలెక్టర్ వెట్రిసెల్వికి పాదపూజ చేస్తున్న విద్యార్థినులు



నూజివీడులో విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేస్తున్న మంత్రి పార్థసారథి

గిన్నిస్ రికార్డుకు జిల్లా నుంచి నూరు శాతం ప్రాతినిధ్యం

రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో నిర్వహించిన మెగా పీటీఎం 2.0 ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించాలన్న రాష్ట్రప్రభుత్వ సంకల్పానికి జిల్లా నూరుశాతం భాగస్వామ్యా న్నిచ్చింది. బుధవారం నాటికి వున్న స్వల్ప లోటును గురువారం ఉదయానికల్లా నూరు శాతానికి భర్తీ చేసినట్టు సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ తెలిపారు. ఇదే క్రమంలో జిల్లావ్యాప్తంగా పీటీఎం కార్యక్రమాలను అన్ని విద్యాసంస్థల్లో నూరుశాతం విజయవంతంగా పూర్తిచేశారు. కాగా గిన్నిస్ రికార్డు నిర్ధారణకు అవసరమైన పీటీఎం 2.0 కార్యక్రమాల ఫొటో లు, వీడియోలను అప్‌లోడ్ చేయడానికి నిర్దేశిం చిన వెబ్‌సైట్ సర్వర్‌పై ఒక్కసారిగా లోడ్ పడడంతో రాత్రి 9 గంటల సమయానికి జిల్లాలో 60 శాతం పాఠశాలల సమాచారాన్ని మాత్రమే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయగలిగినట్టు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. దీంతో అప్‌లోడ్‌ను నిలిపివేసి, శుక్రవారం మిగతా విద్యాసంస్థల వివరాల నమోదును పూర్తి చేయాలని నిర్ణయించారు. జూనియర్ కళాశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమాల అప్‌లోడ్ వివరాలు గురువారం రాత్రి వరకు అందుబాటులోకి రాలేదు. కాగా మొత్తం 2,227 పాఠశాలల్లో జరిగిన పీటీఎం కార్యక్రమాల పరిశీలన, నిర్ధారణలకు విద్యాశాఖేతర అధికారులుగా నియమించిన విట్నెస్/నోడల్ ఆఫీసర్లు తమ నివేదికలను సిద్ధం చేశారు.

సమష్టి కృషితోనే సాధ్యమైంది..

పీటీఎం కార్యక్రమాల్లో మొక్కల పంపిణీ, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల అందజేత, గత విద్యా సంవత్సరంలో విద్యార్థి హాజరు, మార్కుల్లో ప్రగతి, బాలబాలికల ఆరోగ్య విషయాలపై రూపొందించిన హెల్త్ ప్రొఫైల్‌పై తల్లిదండ్రుల తో చర్చ, మొక్కల సంరక్షణ నిమిత్తం విద్యార్థు లకు గ్రీన్‌పాస్ పోర్టుల అందజేత, పేరెంట్స్‌కు ఆటల పోటీలు, గ్రూప్ ఫొటోలు, తల్లులకు పిల్లలతో పాదాభివందనం మొదలైనవన్నీ టీచర్లు ఉత్సాహంగా నిర్వహించారని డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఏపీసీ పంకజ్‌కుమార్ తెలిపా రు. మొత్తం 1,18,134 మందికి హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశామన్నారు.

ఆస్తి పంచేందుకు ఇష్టం లేక..

భార్యను నరికి చంపాడు

- ఆపై పురుగుల మందు తాగి.. గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం
- కట్టావారిపాలెంలో దారుణం



జయలక్ష్మి (ఫైల్)



చికిత్స పొందుతున్న పెద్దిరాజు

కలిదిండి, జూలై 10(ఆంధ్రజ్యోతి):భార్యను హత్య చేసిన భర్త తాను పురుగుల మందు తాగి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఎస్.ఆర్పీఅగ్రహారం పంచాయతీ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన కట్టా పెద్దిరాజుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు చిగురుకోటలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య రొయ్యల కంపెనీలో కూలీగా పనిచేస్తోంది. కొంత కాలంగా కుమారులు, తండ్రికి ఆస్తి తగాదాలు జరుగుతున్నాయ. ఇంటి స్థలం నాలుగు సెంట్లు, పొలం 33 సెంట్లను తమకు రాయాలని తండ్రిపై కుమారులు పలుమార్లు ఒత్తిడి చేశారు. అయితే ఆస్తి పంపకాలకు పెద్దిరాజు ఇష్టపడడం లేదు. భార్య జయలక్ష్మి(44) ఆస్తి పంపకాల విషయంలో కుమారులకు మద్దతుగా ఉంటుందనే నెపంతో బుధవారం రాత్రి భార్యను కత్తితో విచక్షణారహితంగా మెడపై, శరీరంపై పలు చోట్ల నరికాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆపై అతను పురుగుల మందు తాగి అదే కత్తితో తాను గొంతు కోసుకోవడంతో అపస్మాకరస్థితిలోకి వెళ్లాడు. అతడిని వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేయగా, సీఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ జాన్ అమృతం డీఎంహెచ్‌వోగా బాధ్యతలు



- శాఖాపరంగా ఎన్నో సవాళ్లు
- వర్క్ అడ్జస్ట్‌మెంట్ తొలిటాస్క్
- అడ్డగోలు డిప్యుటేషన్లపై ఏ నిర్ణయం తీసుకుంటారో..!
- వైద్య ఆరోగ్యశాఖ ప్రక్షాళన తప్పనిసరి

ఏలూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వోగా బదిలీపై జిల్లాకు ఇటీవల నియ మితులైన డాక్టర్ పి.జాన్ అమృతం గురువారం ఏలూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో విధుల్లో చేరారు. ఇప్పటివరకు డీఎంహెచ్‌వోగా పనిచేసిన డాక్టర్ మాలిని బదిలీపై గుంటూరు నగర పాలకసంస్థ మెడికల్ అండ్ హెల్తాఫీసర్‌గా బదిలీ అయిన విషయం విదితమే. కొత్తగా డీఎంహెచ్‌వో బాధ్యతలు చేపట్టిన డాక్టర్ పి.జే.అమృతంకు వైద్యశాఖలోని పలు విభాగాల అధికారులు, ఉద్యోగులు పుష్ప గుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

తొలి టాస్క్ కీలకమే..

బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో డీఎంహెచ్‌వో పాల్గొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతా ల్లో పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్)పై విని యోగించుకునేలా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శ కాల మేరకు కౌన్సెలింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. ఆ మేరకు ఈ ఏడాది ఏప్రిల్ 16నే జీవో విడు దల చేయగా, రాష్ట్రంలో పలు జిల్లాల్లో కౌన్సెలింగ్ ఇప్పటికే పూర్తికాగా, ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్య శాఖ ఇంతవరకు చేపట్టలేదు. గత మేలో ఒకసారి కౌన్సెలింగ్ జరపడానికి కార్యాచరణను ప్రకటిం చినా సీనియార్టీ జాబితాల్లో తప్పులు దొర్లాయన్న ఆరోపణలతో నిలిపివేశారు. ఈలోగా వర్షాకాలం రావడంతో మళ్లీ ప్రతిపాదనలు తెర పైకి వచ్చాయి. ఈ క్రమంలోనే కీటకజనిత వ్యాధుల వ్యాప్తి నియంత్రణ కార్యక్రమాన్ని (ఎన్ వీబీడీసీపీ) అమలు చేయడానికి ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులను వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై నియమించడానికి కొత్త డీఎంహెచ్‌వో కార్యా చరణను ప్రారంభించాల్సి ఉంది.

అడ్డగోలు డిప్యుటేషన్లు..

వైద్య ఆరోగ్యశాఖలోని అన్ని కేడర్ల ఉద్యోగు లకు జిల్లాస్థాయిలో, పీహెచ్‌సీల మెడికల్ ఆఫీ సర్లకు రాష్ట్రస్థాయిలో కొద్దిరోజుల క్రితమే సాధా రణ బదిలీలు జరిగాయి. మరోవైపు బదిలీల కౌన్సెలింగ్ ముగిసిన రోజుల వ్యవధిలోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ల పర్వం మొదలైంది. ముఖ్యంగా డీఎంహెచ్‌వో కార్యాలయానికి వివిధ పీహెచ్‌సీల నుంచి డిప్యుటేషన్లను పలువురికి ఇష్టానుసారం జారీ చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ఇవి ఆగలేదు. డిప్యుటేషన్ల ఆర్డర్లను పీహెచ్‌సీలు, డీఎంహెచ్‌వో కార్యాలయ సెక్షన్లకు ఈ-మెయిల్ లో పొందుపర్చకుండా వ్యక్తిగతంగా జారీ చేయ డం గమనార్హం. దీంతో డిప్యుటేషన్ల వ్యవహారం బహిరంగంగా తెలుసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇటీవల బదిలీ అయిన పలువురు సీనియర్ అసిస్టెంట్లు, ఎంపీహెచ్‌ఈ వోలు మళ్లీ డీఎంహెచ్‌వో కార్యాలయానికి డిప్యు టేషన్ ఉత్తర్వులను పొందగా, స్టేట్‌కేడర్ పోస్టు లైన పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లలో పలువురికి జిల్లాస్థాయిలోనే డిప్యుటేషన్లు ఎడాపెడా ఇచ్చేసి నట్టు తెలిసింది. వాస్తవానికి జిల్లా నుంచి బదిలీ అయిన అధికారులకు డిప్యుటేషన్లు, కీలక నిర్ణ యాలు తీసుకునే అధికారం ఉండవని, ఒకవేళ అవసరమనుకుంటే రాష్ట్ర ఉన్నతాధికారుల అను మతి పొందాలి. ఈ నేపథ్యంలో డిప్యుటేషన్లు, ఏఎన్ఎంల బదిలీల్లో చోటుచేసుకున్న ఆరోపణ లపై కొత్త డీఎంహెచ్‌వో సమీక్ష చేసి, ప్రక్షాళనపై దృష్టి సారించాల్సి ఉంది.



• శాకంబరిగా రాట్నాలమ్మ

రాట్నాలకుంట రాట్నాలమ్మ శాకంబరిదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కాయగూరలు, ఆకు కూరలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

\- పెదవేగి



• బకాయిలు విడుదల చేయండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యా ర్థులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు డి.శివకు మార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు బకాయిలను విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా కోశాధికారి ఎం. క్రాంతికుమార్, సునీల్, ప్రదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

\- ఏలూరు రూరల్

నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ బృందం పర్యటన


స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా జిల్లాలో ఉత్తమ గ్రామాలను ఎంపిక చేయడంలో భాగంగా కేంద్రం నుంచి ఎంపిక చేయ బడిన అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఏఎంఎస్) బృందా లు జిల్లాలో నేటి నుంచి పర్యటిస్తాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా అధికారులతో కేంద్ర ఏఎంఎస్ సభ్యుల స్టేట్ నోడల్ కో ఆర్డినేటర్ ఎస్.సందీప్, జిల్లా కో ఆర్డినేటర్ పి.సత్తిబాబులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రోజుకు రెండు గ్రామాలు చొప్పున మొత్తం 36 గ్రామాల్లో ఈ బృందం పర్యటిస్తుంది. ప్రజా అభిప్రా యాలు సేకరణ, మరుగుదొడ్ల వినియోగం, పంచాయతీ, పాఠ శాల, అంగన్‌వాడీ, సచివాలయాలు, మార్కెట్ యార్డ్, డ్రెయినేజీ వ్యవస్థ, చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ తరలింపు, ప్లాస్టిక్ నిషే ధం, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై సమాచారం సేకరిస్తారు.

\- ఏలూరు సిటీ

చేయి తడపాల్సిందే!

రెవెన్యూలో పెచ్చు మీరుతున్న అవినీతి

- కొర్రీలతో కాలయాపన.. కాసులకు కక్కుర్తి
- కొందరు వీఆర్వోల నుంచి తహసీల్దార్ల వరకు అదేతీరు
- పీజీఆర్ఎస్‌లో వినతులే నిదర్శనం
- క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ కరువు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూశాఖను అవినీతి జాడ్యం పట్టిపీడి స్తోంది.వైసీపీ హయాంలో పాలకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన రెవెన్యూ సిబ్బంది.. ఆ ఛాయల నుంచి ఇంకా బయటకు రాలేన్న విమర్శలు విన్పిస్తున్నాయి.ఆరోపణలు వస్తే మాకేంటి.. మాపని మాదేనంటూ మొండిగా వెళ్లిపోతున్నారు. సిటిజన్ చార్టర్ ప్రకారం ఎక్కడా పనులు చేయడం లేదు. కాసులకు కక్కుర్తి పడి నెలలు తరబడి పాస్‌బుక్‌లు, పట్టాలు, అడంగల్ ఇతర పత్రాలను ఇవ్వడా నికి రైతులను కార్యాలయాలు చుట్టూ తిప్పించుకుంటున్నారనే ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రతీవారం జరిగే పీజీఆర్ ఎస్‌లో రెవెన్యూతో సంబంధం ఉన్న భూము లు, ఆక్రమణలపైనే అత్యధిక అర్జీలు అంద డం దీనికి నిదర్శనం. వాస్తవాలు తేల్చాల్సిన అధి కారులే మిన్నకుండిపోతున్నారు.

- ముదినేపల్లి మండలం ఊటుకూరు పంచాయతీ పరిధిలో దాదాపు 2.40 ఎకరాల భూమికి పట్టా ఇవ్వడానికి ఓ వీఆర్వో రూ.50 వేలు డిమాండ్ చేశాడు. సంబంధిత రైతు ఇటీవల కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులను కలిస్తే ఏలూరు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లమ న్నారు. అక్కడ సూపరింటెండెంట్ మిమ్మల్ని పిలుస్తామని చెప్పారు. ఇరవై రోజులు గడిచినా ఇంతవరకు అధికారులు స్పందించ లేదు.

వీఆర్వోలు చెప్పిందే వేదం..

గ్రామాల్లో ప్రతీ పనికి ఒక రేటు పెట్టి వీఆర్వోలే చక్రం తిప్పుతున్నారు. కింది స్థాయిలో వారి అవినీతి తారస్థాయికి చేరిం దన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక కొల్లేరు గ్రామాల్లో చెరువుల మరమ్మతులు, గట్లు ఏర్పాట్లలో రూ.లక్షల్లో దండుకుంటు న్నారన్న విమర్శలున్నాయి. కార్యాలయాల్లో వీఆర్వో, ఆర్ఐ, ఇతర సిబ్బంది అందుబాటు లో ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేకు వెళుతున్నామని విధు లకు డుమ్మా కొడుతున్నారు. చాలా మండ లాల్లో కొందరు ఉద్యోగులు, అనధికార వ్యక్తు లు తహసీల్దార్లకు (మిగతా 8వ పేజీలో)

నిర్వాసితుల పేరుతో
ఏజెన్సీలో భూ కుంభకోణం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

బుట్టాయగూడెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు గిరిజన నిర్వాసితుల పేరుతో ఏజెన్సీలో భూకుంభకోణం జరుగుతుందని, భూముల కొనుగోలు పేరుతో కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. వివాదాలున్న భూములను అధికారులు ఏవిధంగా కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఏజెన్సీలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. రెడ్డిగణపవరం, ఇనుమూరు ప్రాంతాల్లో గిరి జనుల స్వాధీనంలో ఉన్న ఎల్‌టీఆర్ భూముల్లో ఎర్రజెండాలు పాతారు. ఎల్‌టిఆర్., 1/70 చట్టం పరిధిలోని భూముల జోలికి వస్తే గిరిజనుల తరఫున సీపీఎం పోరాటం చేస్తుందన్నారు. గిరిజనేతరుల ఆక్రమణలో ఉన్న భూములకు పరిహారం కూడా చెల్లించనక్కరలేదన్నారు. ఏజెన్సీలో భూములన్నీ గిరిజనులకే చెందుతాయని, వాటిని ఆర్ అండ్ ఆర్‌లో ఏవిధంగా సేకరిస్తారని ప్రశ్నించారు. వివాదాలు లేని భూములనే కొనుగోలు చేసి గిరిజన నిర్వాసితులకు ఇవ్వాల న్నారు. అధికారులు వివాదాలు ఉన్న భూములను సేకరించి గిరిజనుల మధ్య గొడవలు పెడుతున్నారని శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల కొనుగోలు చేయడా నికి అధికారులు చూపించిన భూములను పరిశీలించిన నిర్వాసితులు వివాదాలు ఉన్న విషయాలను తెలుసుకుని తిరస్కరించారని అధికారులు గుర్తించాలన్నారు. బుట్టాయగూడెం సమీపంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్వాసితుల కాలనీ లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను పరిశీలించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి డిగ్రీ కాలేజి నిర్మాణం ముందుకు సాగడ లేదని, గిరిజనుల విద్యపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో తెలుస్తుంద న్నారు. ఆసుపత్రి పనులను త్వరగా పూర్తిచేసి సేవలను అందుబాటులోకి తేవాలన్నారు. కాలనీలు కూలిపోయిన తర్వాత నిర్వాసితులను తరలిస్తారా? అంటూ ప్రశ్నించారు. రెండు నెలల్లో ఆసుపత్రి, కాలేజిలను పూర్తి చేయకుంటే జన సమీకరణ చేసి ఉద్యమాలను చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మంతెన సీతారాం, బి.బలరాం, ఎ.రవి, టి.దుర్గారావు, టి.రామకృష్ణ, ఎం.నాగమ ణి, కారం భాస్కర్, ఎ.ఫ్రాన్సిస్, పి.నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ విలీనం చేయవద్దంటూ పెనుమంట్ర సర్పంచ్ దంపతుల ఆమరణ దీక్ష

పెనుమంట్ర, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెనుమంట్ర ఎల్‌పి స్కూల్‌ను మెయిన్ స్కూల్లో విలీనం చేయవద్దంటూ దళిత సంఘాలకు మద్దతుగా గురువారం ఉదయం అమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్టు పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక దంపతులు తెలిపారు. 25 రోజుల నుంచి "మా స్కూలు మాకు కావాలి.. వేరే స్కూల్‌కి వెళ్లేది లేదంటూ" తల్లిదండ్రు లతో కలిసి అధికారులకు ఫిర్యాదులు చేశామని, ఆందోళనలు చేపట్టామని అయినప్పటికీ విద్యాశాఖ అధికారుల్లో చలనం లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరాహార దీక్షకు దిగుతున్నట్లు మండల తహసీల్దార్ వై.రవి కుమార్‌కు సర్పంచ్ దంపతులు తెలిపారు. ఎంఈఓ-2 మోసపూరిత తీర్మానాలు చేసి విలీనం చేశారని ఆరోపించారు 28 మంది విద్యార్థులను వేరే పాఠశాలలో పంపించేది లేదంటూ తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని దీనిపై స్పందన లేకపోవడంతో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. విలీనం చేసిన పాఠశాల వెనుకభాగంలో చెరువు ఉందని, పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యతను అధికారులు తీసుకుంటారా ? అని ప్రశ్నించారు. 11వ తేదీ ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత సంఘాలకు మద్దతుగా తాము దీక్ష చేపడుతున్నామన్నారు.



తహసీల్దార్ రవికుమార్‌కు దీక్షకు సంబంధించిన పత్రం అందిస్తున్న గ్రామ సర్పంచ్



సహస్ర దీపాల వెలుగులో ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ

కుంకుళ్లమ్మకు సహస్ర దీప సేవ

ద్వారకాతిరుమల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): క్షేత్రదేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి సహస్రదీప సేవ నిర్వహించారు. ఏడాదికోసారి ఆషాఢమాసంలో ఈ సేవను జరుపడం సంప్రదాయంగా వస్తోంది. ఆలయ ప్రాంగణం, పరిసరాలను సిబ్బంది సుందరీకరించారు. అనంతరం పలువురు భక్తులు ప్రమిదిలలో నూనె పోసి దీపాలను భక్తి ప్రపత్తులతో వెలిగించారు. దీపాల వెలుగులో ఆలయ పరిసరాలు దేదీప్య మానంగా వెలుగొందాయి. అమ్మవారి మూల విరాట్ వద్ద అర్చకులు దీపాలు వెలిగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



చెరువులో పంటల సాగు

వివాదంలో కొవ్వలి పెద్ద చెరువు

దెందులూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కొవ్వలి గ్రామంలో ఉన్న పెద్ద చెరువుపై ఏపీ హైకోర్టు ఇచ్చిన స్టేటస్ కో ఆర్డర్‌ను కొంత మంది ఉల్లంఘించి చెరువులో పంటలు పండించేందుకు చెరువులో నీటిని తీసి వేస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధకు కొవ్వలి రైతులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ చెరువును కొంత మంది రికార్డులను మార్చేసి మత్సకార సంఘాల పేరుతో సాగు చేస్తున్నారని కొవ్వలి గ్రామానికి చెందిన గ్రామ దీప్ స్వచ్ఛంధ సంస్థ చైర్మన్ డాక్టర్ వెలమటి మనోహరి గతంలో హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే తామంతా పేద దళితులమని చాలా సంవత్సరాలుగా పంటలు పండించుకుంటున్నామని మా పొట్ట కొట్టిందంటూ కొవ్వలి దళితులు నిరసన తెలుపుతున్నారు.

వివరాల్లోకి వెళితే దెందులూరు మండలంలోని కొవ్వలి గ్రామంలోని 304 ఎకరాల్లో పెద్ద చెరువు ఉంది. 1963లో ఈ భూమిలో ప్రభుత్వ వ్యవసాయ విత్తనాభివృద్ధి కేంద్రం, మత్స్య సంపద అభివృద్ధికి 126 ఎకరాలు కేటాయించారు. మిగిలిన చెరువు పంచాయతీ ఆధ్వర్యంలోనే ఉంది. కొంతకాలం కిందట వైసీపీ ప్రభుత్వంలో స్థానిక అధికారులకు ముడుపులు ఇచ్చి దళిత భూములుగా మార్చుకున్నారని ప్రచారం ఉంది. అయితే ఆర్‌ఎస్‌ఆర్ రికార్డుల్లో ఇప్పటికి నిషేధిత జాబితాలోనే ఈ భూమి చూపిస్తోంది. కొవ్వలి గ్రామంలోని కలకాలమ్మ, జమ్మి, పెద్ద పేర్నిటి, పసర, గొల్లవాని చెరువులు ఉన్నాయి. మొత్తం 180 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువులు ఉన్నాయి. వీటిని వైసీపీకి చెందిన కొంత మంది మత్స్యకార సొసైటీ పేరుతో మూడేళ్ల కాలపరిమితికి లీజుకు తీసుకున్నారు. ఇక్కడ చేపల పెంపకం చేయలేనందున పంచాయతీలకు 2021- 2023 సంవత్సరం కాలంలో రూ.5 లక్షల 25 వేలు మాత్రమే చెల్లించారు. అయితే సబ్ లీజ్‌కు ఏడాదికి రూ.25 లక్షల చొప్పున మూడేళ్లకు రూ.75 లక్షలు వసూలు చేశారని ప్రచారం జరిగింది. పెద్ద చెరువు ఆక్రమాలపై 2023లో గ్రామ దీప్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ వెలమాటి మనోహరి హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేసి నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. నివేదిక ప్రకారం పెద్ద చెరువులో ఎలాంటి కార్యకలాపాలు చేయవద్దని 2024 ఆగస్టులో హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. కోర్టు తీర్పు రాకముందే గ్రామంలో పెద్దలతో మాట్లాడుకున్నామని సుమారు 200 మంది దళితులు వరి పంటను పండిస్తున్నామన్నారు. చెరువులో పంటలు వేసేందుకు చెరువులో నిల్వ ఉంచిన సాగునీటిని కిందకు వదులుతున్నారని వెంటనే హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

అభాగ్యులకు అండగా..



ఆదరిస్తున్న శిశువిహార్
దత్తత స్వీకారానికి ముందుకొస్తున్న పిల్లలు లేని తల్లిదండ్రులు
ఈ నెలలోనే ముగ్గురు..

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆర్థిక సమస్యలు, నిరక్షర్యాసత, వ్యక్తిగత కారణాలతో పలువురు పిల్లలను రోడ్లు మీద వదిలేస్తున్నారు.కొందరు చెత్తబుట్టలో పడేస్తున్నారు. అలాంటి అభాగ్యులను స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు శిశు గృహానికి తరలించి వారిని సంరక్షిస్తున్నారు. పిల్లలు లేని తల్లి దండ్రులకు వారిని చట్టబద్ధంగా దత్తత ఇస్తున్నారు. సంతాన లేమితో అమ్మా, నాన్న పిలుపునకు దూరమైన వారంతా మానవత్వం చాటుకుంటున్నారు. మరోవైపు రెండో సంతానం లేని వారు కూడా దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తు న్నారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన పదేళ్లలో ఇప్పటి వరకు 61 మంది చిన్నారులతో పాటు 18 ఏళ్ల లోపు వారిని అక్కున చేర్చుకున్నారు.

కొద్దికాలంగా పెళ్లైన జంటలను వేధిస్తున్న సమస్య సంతానలేమి. మరోవైపు మేనరిక వివాహాలతో పిల్లల్ని కంటున్నా ఏదో ఒక లోపం ఉండటంతో దత్తత బాట పడుతున్నారు. కోట్లు సంపాదించినా కన్నబిడ్డలు లేని లోటు ఎవరూ తీర్చలేనిది. మాతృత్వానికి దూరంగా ఉంటున్న పలువురు తల్లిదండ్రులు దత్తతపై ఆసక్తి కనబ రుస్తున్నారు. దీంతో విధి వంచితులైన చిన్నా రులకు కొత్త జీవితాన్ని అందిస్తున్నారు.



ఒక కుటుంబానికి బాలుడిని దత్తత ఇస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి (ఫైల్)

దత్తత పొందడం ఇలా ..

పిల్లలను దత్తత తీసుకోవాలంటే వారి పాన్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ:// సీఏఆర్ఏ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలి. అన్ని ధృవపత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దత్తత ఏజెన్సీకి వారికి రూ.6 వేలు డీడీ రూపంలో చెల్లించాలి. అలాగే బిడ్డను పొందే సమయంలో రూ.50 వేలు మరలా డీడీ రూపంలో ఇవ్వాలి. పాన్‌కార్డు, ఆదాయ, వయసు, నివాస, వివాహ, ఆరోగ్య ధృవపత్రాలతో పాటు దంపతుల ఫొటోలు అందించాల్సి ఉంటుంది.

పెంచగలిగే వయసు ఆధారంగా పిల్లల దత్తత

మహిళా, శిశు సంక్షేమశాఖ పర్యవేక్షణలో ఏలూరు నగరంలో విద్యానగర్‌లో ఉన్న శిశు గృహ ద్వారా ఒక పార్ట్‌టైమ్ డాక్టర్ ఇతర సిబ్బంది 12 మంది, ప్రభుత్వం పర్యవేక్షణలో విధివించుతులైన చిన్నారులు, ఆదరణ కరువైన వారిని సంరక్షిస్తుంటారు. కొత్తబస్టాండ్ రోడ్డు వద్ద ఉన్న జిల్లా బాల సంరక్షణాధికారి డాక్టర్ సూర్య చక్రవేణి పర్యవేక్షణలో తల్లిదండ్రులకు దత్త ఇస్తుంటారు. పెంచగలిగే వయసు ఆధారంగా నెలలు వయసు నుంచి 18 ఏళ్లలోపు బాలలు, యువత, యువకులను దత్తత ఇస్తారు. భార్యా భర్తలు వయసు కలిపి మొత్తం 90 ఏళ్లు ఉంటే రెండేళ్ల లోపువారిని, 95 సంవత్సరాలు దాటితే 4 ఏళ్ల వయసు దాటిన వారిని దత్తత ఇస్తారు. ఈశాఖ ద్వారా అన్ని లాంచనాలు పూర్తి చేసుకున్న తర్వాత కలెక్టర్ చేతుల మీదుగానే దత్తత స్వీకారం ఉంటుంది. దరఖాస్తు చేసిన వెంటనే దత్తత ఇవ్వరు. ఒక్కోసారి రెండేళ్ల నుంచి నాలుగేళ్ల సమయం వరకు పట్టొచ్చు.

ఆర్నెళ్లకు ఒకసారి పరిశీలన

జిల్లాలో ఇప్పటి వరకు 61 మందిని దత్తత ఇచ్చారు. దత్తత వెళ్లిన చిన్నారులు, యువత బాగోగులపై బాలల సంరక్షణాధికారి పర్యవేక్షణలో సిబ్బంది ఆర్నెళ్లకొకమారు ఆరా తీస్తుంటారు. అయితే ఇప్పటి వరకు తల్లిదండ్రులు దత్తత తీసుకుని వారితో ఇమడలేక ముగ్గురు వెనక్కి రాగా, ఇద్దరు మళ్లీ వివిధ చోట్ల చదువుకుంటున్నారు. ఒకర్ని మాత్రం ఇంకో కుటుంబానికి దత్తత ఇచ్చారు. ఒక్కోసారి ఇమడలేని వారికి కూడా కౌన్సెలింగ్ ఇచ్చి సర్ధిచెప్పి వెనక్కి పంపిన సందర్భాలున్నాయి. ఇదిలా ఉండగా వివిధ ఎన్జీవోల సంరక్షణలో ఉన్న చిన్నారులు, యువతను కూడా దత్తత ఇచ్చే బాధ్యతలను బాలల సంరక్షణాధికారే చూడాల్సి ఉంటుంది. కలెక్టర్ పర్యవేక్షణలోనే దత్తత ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. విధి వంచితులు ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రత్యేక శ్రద్ధతో వారిని పలకరించడం, బాగోగులను ఆరా తీయడంతో అధికారులు కూడా సానుకూలంగా పనిచేస్తున్నారు.

వారి కళ్లలో ఆనందం చూస్తున్నాం



సంతాన లేమితో చాలా మంది బాధపడుతూ పిల్లల్ని దత్తత తీసుకోవడానికి మా దగ్గరికి వస్తుంటారు. వారి పిల్లలను తీసు కెళ్లినప్పుడు వారి కళ్లలో ఆనందం వర్ణించ లేనిది. పిల్లల దత్తత మాద్వారా చట్టబద్దత ఉంటుంది. ఆస్తులున్న వారే మానవత్వంతో మరోబిడ్డను సాకాలని మా దగ్గరికి వస్తుం టారు. ఆదరణ లేని వారికి జీవితాన్ని ఇచ్చామనే అనుభూతిని వారు ఆస్వాదిస్తు న్నారు. ఒక్కరు అబ్బాయి కలిగి ఉంటే వారికి తోడుగా అమ్మాయి, అమ్మాయి ఉంటే అబ్బాయిని తోడుగా దత్తత తీసుకుంటున్నారు. ఇది మంచి శుభపరిణామం. దత్తత తీసు కోదలచిన వారు 08812-232871 నంబర్ లేదా 1098 నంబర్‌లో సంప్రదించవచ్చు.

- డాక్టర్ సూర్యచక్రవేణి, జిల్లా బాలల సంరక్షణాధికారి, ఏలూరు

హలో ! కొట్టేస్తారు..

మాయల పకీర్ ప్రాణం చిలకలో ఉన్నట్లు నేడు మానవుడి ప్రాణం తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌లో చిక్కుకుపోయింది. సెల్‌ఫోన్ నేడు నిత్యావసర వస్తువులా మారిపోయింది. కిరాణా కొనుగోలు నుంచి బ్యాంకు లావాదేవీల వరకు అన్నిటికి సెల్‌ఫోనే ఆధారమైపోయింది. అలాంటి ఫోన్ ఎవరైనా తస్కరిస్తే గుండె ఆగినంత పనవుతుంది. ఫోను పోతే పోయింది. కానీ అందులో డేటా ఎలా అంటూ కుమిలిపోయే పరిస్థితి ఉంది. మొబైల్ దొంగలు చాకచక్యంగా ఫోన్లు తస్కరిస్తున్నారు. లక్షల విలువైన ఫోన్లు కూడా సెకన్లలో కొట్టేస్తారు. ఇటీవల సెల్‌ఫోన్ చోరీలు భారీగా పెరగడంతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎక్కడ మొబైల్ చోరీకి గురైనా వెంటనే వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే కొద్ది రోజుల్లోనే ఫోన్‌ను రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నారు.



ఆరు నెలల క్రితం తాడేరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబంతో ఊరు వెళ్ళడానికి జంక్షన్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా సుమారు లక్షా 50 వేల విలువ గల మొబైల్ ఫోన్‌ను దొంగలు దోచుకున్నారు. తీరా రైలు ఎక్కి చూసుకునేసరికి మొబైల్ కనబడలేదు. అనంతరం కంగారు పడి అన్నిచోట్ల వెదికినా ఫలితం దక్కలేదు. జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎస్పీ కార్యాలయంలో ఉన్న వాట్సప్ నంబర్‌కు ఫోన్ చేయమన్నారు.

రెండు నెలల క్రితం ఒక వ్యక్తి భీమవరం శివారు బొక్కావారి పాలెం వద్ద రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం ఆపి సెల్ ఫోన్ మాట్లాడుతుండగా భీమవరం వైపు నుంచి పాలకొల్లు వైపు వెళ్ళే ఇద్దరు వ్యక్తులు మొబైల్ ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. బాధితుడు వెంటనే జిల్లా ఎస్పీ కార్యాలయంలోని వాట్సప్ నంబర్‌కు ఫిర్యాదు చేశారు.

పాలకొల్లుకు చెందిన ఒక మహిళ తన రెండు మొబైల్ ఫోన్లను బ్యాగులో పెట్టుకుని బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో దొంగలు చాకచక్యంగా రెండు ఫోన్లను దొంగిలించారు. వాటి విలువ సుమారు రూ. 3 లక్షల వరకు ఉంటుందని ఇతర దేశాల నుంచి తన కుమారుడు పంపించాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళుతూ వర్షం వస్తుందని చెట్టు నీడలో తమ వాహనాన్ని ఆపడంతో గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి వారి వాహనానికి ఉన్న బ్యాగును దొంగిలించుకుపోయారు. ఆ బ్యాగులో రెండు ఫోన్లతో పాటు కొద్దిగా నగదు కూడా ఉంది.

ఇటీవల పెరిగిన మొబైల్ చోరీలు
ఫోన్ల రికవరీ కోసం పోలీసు ప్రత్యేక టీమ్
పశ్చిమలో ఇప్పటి వరకు 1,612 రికవరీ

భీమవరం క్రైం, జులై 10 (ఆంధ్రజ్యోతి) : ఆదమరిస్తే దొంగలు క్షణాల్లో ఫోన్లు కొట్టేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాగా ఏర్పడ్డాక ఇప్పటి వరకు 1,612 ఫోన్లు (రూ.2 కోట్ల 40 లక్షల 30 వేలు) రికవరీ చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇప్పటికి 9 సార్లు జిల్లా ఎస్పీలు ప్రెస్‌మీట్‌లు పెట్టి బాధితులకు ఫోన్లు అప్పగించారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది ఇప్పటి వరకు 290 ఫోన్లు (43 లక్షల 50 వేలు) రికవరీ చేసినట్లుగా పోలీసు రికార్డులు చెబుతున్నాయి. జిల్లా పోలీసులు పోలీసు ఉన్నతాధికారుల అభినందనలు కూడా అందుకున్నారు.ఇతర జిల్లాల పోలీసులు అక్కడ పోయిన ఫోన్ల వివరాలను కూడా ఇక్కడ వాట్సప్ నంబర్‌కు పొందుపరిచే విధంగా బాధితులకు సూచనలు ఇస్తున్నారు.



బాధితురాలికి ఫోన్ అందిస్తున్న ఎస్పీ నయీం అస్మి

పెరిగిన ఫోన్ల వాడకం

ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ లేని వ్యక్తి లేరంటే అతిశయోక్తి కాదు. ప్రతి ఒక్కరికి మొబైల్ తప్పనిసరైపోయింది. వేసుకునే వస్త్రాలతో పాటుగా మొబైల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకుని వెళ్ళవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫోన్ల ఖరీదు కూడా కొన్ని లక్షల్లో ఉంటున్నాయి. ప్రయాణ సమయాల్లో ఆదమరిస్తే దొంగలు ఫోన్లు కొట్టేస్తున్నారు. బాధితులు లబోదిబోమంటున్నారు.మొబైల్‌లో ఉన్న డేటా పోవడం వల్ల చాలామంది ఇబ్బందులు పడుతున్నారు.

ఫోన్ల రికవరీలో ముందంజ

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 91549 66503 అనే వాట్సప్ నంబర్ ద్వారా వేలల్లో ఫోన్లు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ కోసం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఎవరిదైనా మొబైల్ చోరీకి గురైతే వాట్సప్ నంబర్‌కు హాయ్ అని పెట్టగానే అవతలి నుంచి ఒక అప్లికేషన్ వాట్సప్‌కు వస్తుంది. అప్లికేషన్‌లో బాధితుడి పేరు, తండ్రి పేరు, మొబైల్ ఐఎంఈఐ -1, ఐఎంఈఐ 2 నంబర్లు, అడ్రస్, పోయిన ఫోన్‌లో ఉన్న నంబరు తదితర వివరాలను అందులో పొందుపరచగానే వారు ఫిర్యాదు నమోదు చేసుకుంటారు. 10-15 రోజుల్లో సర్కిల్ ఐటీ కోర్ నుంచి బాధితుడికి ఫోన్ వస్తుంది. వివరాలు తీసుకుని ఫోన్ ఐఎంఈఐ నంబర్ ద్వారా ట్రాక్ చేస్తారు. తర్వాత ఆ ఫోన్ ఎక్కడ ఉందో తెలుసుకుని వారికి ఫోన్ చేస్తారు. ఫోన్ ఎత్తిన అవతలి వారు దొరికిందనో, తెలియక కొన్నామనో అని చెప్పి స్వచ్ఛందంగా ఆ ఫోన్లను పోలీసులకు అందజేస్తారు. వాటి నంబర్ల ఆధారంగా పోలీసులు బాధితులకు అప్పగిస్తారు.



రికవరీ చేసిన ఫోన్ అందిస్తున్న ఎస్పీ కిషోర్ (ఫైల్)

ఏలూరు జిల్లాలో 2,976 రికవరీ

ఏలూరు క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో ఇప్పటికి 15 పర్యాయాల్లో 2,976 ఫోన్లు (సుమారు 4 కోట్ల 75 లక్షల రూపాయలు)లను బాధితులకు అందజేశారు. గతంలో ఫోన్లు ఎవరైనా తస్కరిస్తే ఇన్సూరెన్సులు ఉన్నవాటికి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం, లేదా నాట్ ట్రేస్‌డు సర్టిఫికెట్ పొంది మరో ఫోనును ఇన్సూరెన్సు ద్వారా పొందేవారు. ఫోన్ పోతే ఎక్కడ ఉన్నా రికవరీ చేసి అందజేస్తామంటూ పోలీసు శాఖ ప్రత్యేక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఫోను పోతే వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు వాట్సప్ నంబర్ 95503 51100ను అందుబాటులోకి తెచ్చారు. ఆ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పెట్టగానే అందుబాటులో సర్వీసులు మెస్సేజ్ వస్తుంది. తరువాత ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నెంబర్లు, బిల్లు, ఫిర్యాదుదారుని ఆధార్‌కార్డు వివరాలు, ఫోన్ నెంబర్ వంటివి నమోదు చేసి సబ్‌మిట్ చేస్తే పోలీస్ శాఖకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుంది. ఆ తరువాత పోలీసులు ఆ ఫోన్ ఎక్కడ ఉన్నా ఎవరు వాడుతున్నా ఇట్టే పసిగట్టి రికవరీ చేస్తారు.

వెంటనే ఫిర్యాదు చేయాలి : ఎస్పీ కిషోర్

నేడు ప్రతి ఒక్కరికి సెల్‌ఫోన్ ముఖ్యమైన వస్తువుగా ఉంది. ఇలాంటి ఫోను పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రిపోర్టు చేయాలి. జిల్లాలో ఇప్పటి వరకూ 2,976 ఫోన్లు సుమారు 4 కోట్ల 75 లక్షల రూపాయల విలువైన వాటిని రికవరీ చేసి ప్రజలకు అందజేశాం. ఈ ఫోన్లు ఇతర జిల్లాల్లో, రాష్ట్రాల్లో యూజర్ల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నాం. జిల్లాలో ఎవరైనా దొంగిలించిన వస్తువులను కొనడం, అమ్మడం నేరం. మూడు సంవత్సరాలు జైలు శిక్ష, జరిమానా కూడా విధిస్తారు. రైతు బజార్లు, మార్కెట్లు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, ఏటీఎంల వద్ద దృష్టి మళ్ళించి సెల్‌ఫోన్లు అపహరించే ముఠాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ఈ వంతెనలకు మోక్షమెప్పుడో ?

ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరుతో పాటు మండలంలోని పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉంగుటూరు వంతెనపై నిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. టోల్ గేట్‌ను తప్పించుకునేందుకుగాను భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో నారాయణపురం వంతెనలా శిథిలావస్థకు చేరుకుంటుందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాదంపూడి గ్రామాన్ని తాడేపల్లిగూడెంను కలిపే దారిలో ఉన్న ఏలూరు కాల్వపై ఉన్న వంతెన కూడా మరమ్మతులకు గురవడంతో ఆందోళన చెందుతున్నారు నారాయణపురం మరుక్కోడు వంతెన కూడా. మధ్య మధ్యలో పెచ్చులూడి పోవడం పైగా భారీ వాహనాల రాకపోకలు జరుపడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సీతారాంపురం శివారులోని వంతెన వద్ద ఇటీవల ద్వారకాతిరుమల నుంచి వస్తున్న ఆటో అదుపు తప్పి పెను ప్రమాదం తప్పింది. వంతెనల కు మరమ్మతులు అయినా చేయాలని కోరుతున్నారు. నారాయణపురం వంతెనకు శాశ్వత పరిష్కారం చేయాలని గ్రామానికి చెందిన పాతూరి సత్యనారాయణ కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఉంగుటూరు వంతెన



పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు ఈఈ ఏసుబాబు బుధవారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీరు విడుదల చేసినట్లు తెలిపారు.

వ్యవసాయం.. జీవన విధానం

ఉద్యాన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ నజీర్

ఉంగుటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కేవలం జీవనోపాధి సాధనం కాదని, అది జీవన విధానమని గవర్నర్, ఉద్యాన విశ్వవిద్యాలయం కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రజామందిరంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆరో స్నాతకోత్సవం నిర్వహించారు. గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించి డిగ్రీ పూర్తిచేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ముఖ్యఅతిథి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఐసీఏఆర్ -ఎన్ఏఏఆర్ఎం) డైరెక్టర్ డాక్టర్ గోపాల్‌లాల్ స్నాతకోపన్యాసం చేశారు. గవర్నర్ మాట్లాడుతూ హార్టీకల్చర్ యూనివర్సిటీ స్థాపించిన ఒకటిన్నర దశాబ్ద కాలంలోనే ఉద్యానవన విద్య, పరిశోధన, విస్తరణలో ప్రభావవంతమైన కృషి అభినందనీయమన్నారు. పట్టభద్రులవుతున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. ఉపకులపతి కె.గోపాల్ విశ్వవిద్యాలయం ఏర్పాటు, అందిస్తున్న కోర్సులు, సాధించిన విజయాలు, పురోభివృద్ధి గురించి వివరించారు. అనంతరం అతిథుల చేతులమీదుగా బంగారు పతకాలు సాధించిన 10మంది విద్యార్థులతోపాటు 38మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 119మంది పీజీ, 1152మంది బీఎస్సీ(ఆనర్స్)పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. 2023నుంచి 2025వరకు అత్యుత్తమ సేవలు అందించిన కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తికి బెస్ట్ ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్ అవార్డు, డాక్టర్ కె.లలితకు బెస్ట్ టీచర్ అవార్డు, వి.శివకుమార్‌లకు బెస్ట్ సైంటిస్ట్ అవార్డులు, అందజేశారు.



కక్షిదారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):కేసులు త్వరితగతిన పరిష్కారం కావడంపై న్యాయవాదులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి సూచించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అధ్యక్షతన జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం కక్షిదారులకు 'మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై అవగాహన కలిగించారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి శుక్రవారం 1 కే వాక్ నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ఏలూరు కోర్టుల పరిధిలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, పోలీస్ సిబ్బంది, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు సిబ్బంది పాల్గొంటారనన్నారు. న్యాయాధికారులు వై.శ్రీనివాసరావు, కె.రత్నప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మునిసిపల్ మేనేజర్‌తో వాగ్వాదం

ఆకివీడు, జూలై 10(ఆంధ్రజ్యోతి):డోర్ నెంబర్ కేటాయింపులో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్‌వలీ, బాసిత్ మునిసిపల్ మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. వారు గురువారం నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఆర్ఎస్ నెంబర్ తప్పు ఉన్నప్పటికీ డోర్ నెంబర్ ఎలా కేటాయిస్తారని మేనేజర్ వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. పంచాయతీ స్థాయిలో ఉన్నపుడు డోర్ నెంబర్ కేటాయించారని, అభ్యంతం ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేయాలని మేనేజర్ సూచించడంతో వారిద్దరూ వాగ్వాదానికి దిగి కార్యాలయం బయట భైఠాయించారు. మేనేజర్‌పై పలు ఆరోపణలు చేశారు. దీనిపై మేనేజర్ తన విధులకు ఆటంకం కలిగించారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హనుమంతు నాగరాజు విచారణ అనంతరం చర్యలు చేపడతామన్నారు. ఈ ఘటన నేపథ్యంలో మేనేజర్ ఒత్తిడి గురై అస్వస్థతతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

రూ.10 లక్షల విలువైన 110 ట్రాన్స్‌ఫార్మర్ల అపహరణ



దేవరపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి):విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగిదిమ్మలు దొంగిలించిన అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌లో రాగి వైర్ల కోసం దొంగతనాలు ఎక్కువగా జరుగుతుండడంతో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ టీమ్‌లు సీసీ కెమెరాల సహకారంతో నలుగు రు అంతర్‌జిల్లాల దొంగలను దేవరపల్లిలో అరెస్టు చేసినట్టు తెలిపారు. రాగి వైరు కొనుగోలు చేసిన ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఉమ్మ డి ఉభయ గోదావరి జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించినట్టు తెలిపారు. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందన్నారు. చోరీకి పాల్పడిన వీరవాసరం మండలం రాయకుదురుకు చెందిన కడలి సతీష్, అత్తిలి మండలం మంచిలికి చెందిన బళ్లా విజయరత్నం, భీమవరం మండలం దెయ్యాలతిబ్బకు చెందిన ఏలూరు పోసియ్య, ఎన్టీఆర్ జిల్లా కృత్తివెన్ను మండలం లక్ష్మీపురానికి చెందిన వేంద్రపు దుర్గాశ్రీనివాస్, వీరితోపాటు చోరీ సొత్తు కొన్నవారు భీమవరం మండలం గొల్లవానిదిబ్బకు చెందిన పావురాయిల కోటేశ్వరరావు, దిరుసుమర్రుకు చెందిన సవరపు భీమారావును అరెస్టు చేశారు. రెండు కార్లు, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును చేదించిన దేవరపల్లి సీఐ బీఎన్.నాయక్‌ను, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, రాజమండ్రి సీసీఎస్ సీఐ శ్రీధర్ కుమా ర్, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. దేవరపల్లి విద్యుత్ శాఖ ఏఈ సీహెచ్ వెంకట్రావు పాల్గొన్నారు.



ప్రమాదకరమైన వస్తువులు, రసాయనాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు జనావాసాల చేరువలో నిర్వహించకూడదు. ప్రధానంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులకు వాటికి 500 మీటర్ల దూరంలో ఏర్పాటు చేసుకోవాలి. ఈ నిబంధనలు జిల్లాలో అమలు కావడం లేదని ఇటీవల వరుస అగ్ని ప్రమాదాలతో స్పష్టమవుతోంది. పరిశ్రమలశాఖ, అగ్నిమాపక శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖాధికారుల తీరుపై పలు విమర్శలు వస్తున్నాయి. పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలన చేయకుండా అనుమతులు ఇవ్వడంతో ప్రమాదాలకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రమాదాల ఫ్యాక్టరీలు

- జనావాసాల మధ్య ప్రమాదకర పరిశ్రమలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- శాఖాపరమైన తనిఖీలు లేవు!
- మూడు నెలల్లో మూడు భారీ ప్రమాదాలు

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):పరిశ్రమల ఏర్పాటులో పరిశ్రమలు, పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, విద్యుత్‌శాఖ అధికారుల సంయుక్త తనిఖీలు లేవు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోనే సంయుక్త తనిఖీలు చేయాల్సి ఉంది. ఆశాఖ అధికారులు పనితీరులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఎక్కడ బడితే అక్కడ జనవాసాల మధ్య ప్రమాదకరమైన ఫ్యాక్టరీలు ఏర్పాటవుతున్నాయి. ఇటీవల 3 భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఏప్రిల్‌లో సోమవరప్పాడు వద్ద దుర్గ క్వాయర్ ఇండస్ట్రీ దగ్ధమైంది. రోడ్డు ప్రక్కనే ఈ కంపెనీ నెలకొల్పారు. వాస్తవానికి అంత దగ్గరలో అనుమతులు ఇవ్వకూడదు. తంగెళ్లమూడిలోని గణేశ్ కుషన్ కంపెనీ మే నెలలో దగ్ధమైంది. ఇది కూడా కోట్ల రూపాయల్లోనే నష్టం వాటిల్లింది. ఈ రెండింటిలో ఒకటి షార్ట్‌షార్క్యూట్ మరొకటి వెల్డింగ్ చేస్తుండగా రవ్వలు అంటుకుని అగ్ని ప్రమాదం సంభవించింది. ఏలూరు సమీపంలోని కొత్తూరురోడ్డు, వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి ఎదురుగా సుస్మిత ఫర్నిచర్ కుషనింగ్ కంపెనీలో అగ్నిప్రమాద సంఘటనతో అధికారులే అవాక్కయ్యారు. భారీ యంత్ర సామగ్రి, ఒకే గోడౌన్‌లో తయారీ ప్రక్రియ జరుగుతుంది. స్పాంజ్, రకరకాల ఫోమ్స్ తయారీ, బాయిల్డ్ ట్యాంకులు, కెమికల్ ట్యాంకులు, పరుపుల తయారీకి వినియోగించే ముడి సామగ్రి అంతా అక్కడే ఉన్నాయి. భారీగా స్పాంజ్ తయారు చేసిన నిల్వలు ఉండడంతో ఒక్కసారిగా ప్రమాదం



ఏలూరు సమీపంలోని పరుపుల తయారీ కంపెనీలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సంభవించి మూడు గంటల పాటు దట్టమైన పొగలు అలముకున్నాయి. వాస్తవానికి ఈ పరిశ్రమకు అనుమతి ఇవ్వకూడదు. ఎదురుగా క్యాన్సర్ ఆసుపత్రి, పక్కనే ఫంక్షన్‌హాలు, మరోవైపు జనవాసాలున్నాయి. పరిశ్రమలు, అగ్నిమాపక శాఖ అధికారులు అనుమతి ఎలా ఇచ్చారో అంతుపట్టని విషయం.

పరిశ్రమపై ఫిర్యాదులు

జాయింట్ యాక్షన్ కమిటీ తనిఖీలకు మూడు నెలల క్రితమే పరిశ్రమల శాఖ అధికారి రంగం సిద్ధం చేశారు. ఈ పరిశ్రమపైనే ఫిర్యాదులు రావడంతో అన్ని శాఖలతో కలిసి పరిశీలనకు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆ అధికారి బదిలీ కావడంతో తనిఖీ చేయలేదు. ఫలితంగా ప్రమాదం సంభవించింది.!

పై అధికారులదే పాపం..!

సుస్మిత ఫర్నిచర్ సంస్థకు అనుమతి పాపం పై అధికారులదే అని తెలుస్తోంది. రెండున్నరేళ్ల క్రితం ఈ ఫ్యాక్టరీ తనిఖీ చేయడానికి కైకలూరు అగ్నిమాపక శాఖ అధికారి వెళ్లారు. ఆయన పరిశీలించి అగ్ని ప్రమాదాల నివారణకు స్ప్రింక్లింగ్ పైపులైన్లు వేయాలని, గోడౌన్‌లు విడివిడిగా ఉండాలని, గోడౌన్ల మధ్య కొంత ఖాళీ ఉండాలని సూచించారు. ఫ్యాక్టరీ నిర్వాహకులు రాష్ట్రస్థాయి అధికారుల నుంచి అనుమతి పొందినట్లు తెలుస్తోంది.

పరుపుల తయారీ పరిశ్రమ దగ్ధం

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):అగ్ని ప్రమాదంలో పరుపుల తయారీ కంపెనీ, గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు సమీపంలోని కొత్తూరు రోడ్ వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి ఎదురుగా సుస్మిత ఫర్నీచర్ కుషనింగ్ సంస్థను శీలంశెట్టి రాజా, శీలంశెట్టి కిశోర్‌కుమార్, శీలంశెట్టి సంధ్య, కొండవీటి నీలిమ నిర్వహిస్తున్నారు. జ్యూట్‌మిల్లు గోడౌన్లు లీజుకు తీసుకుని పరుపుల తయారీ, స్పాంజ్, ఫోమ్, ఇతర షీట్లు తయారీ కొనసాగిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి కార్మికులు వెళ్లిపోయిన తర్వాత బుధవారం రాత్రి ఇద్దరు వాచ్‌మెన్‌లు ఉన్నారు. స్పాంజ్, ఫోమ్ తయారీకి ఉపయో గించే రసాయనాలు కూలింగ్‌లో ఉంచాలి. ఈ రెండు ట్యాంకుల వద్ద పెద్ద ఏసీని గురువారం ఉదయం 6 గంటలకు వాచ్‌మెన్ ఆన్‌చేశాడు. తర్వాత మెయిన్ గేటు వద్ద టిఫిన్ చేస్తుండగా 6.30 గంటల సమయం లో లోపల నుంచి పొగలు రావడం గమనించారు. క్షణాల్లోనే స్పాంజ్, ఫోమ్ ఇతర కెమికల్స్ మండడంతో భారీ ఎత్తున పొగలు వ్యాపించాయి. మంటలు ఎగిసి పడడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులయ్యారు. ఎదురుగా క్యాన్సర్ ఆసుపత్రిలో రోగుల రక్షణకు ఆసుపత్రి సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న జిల్లా అదనపు అగ్నిమాపక శాఖ అధికారి వి.రామకృష్ణ 2 ఫైర్ ఇంజన్లతో చేరుకున్నారు. మరోవైపు భీమడోలు, హనుమాన్ జంక్షన్, కైకలూరు ఫైర్ ఇంజన్లు కూడా రప్పించారు. 3 గంటల పాటు 5 ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పుతూనే ఉన్నాయి. అప్పటికే గోడౌన్‌లో కెమికల్స్, ఫోమ్, పరుపులకు సంబంధించిన మెటీరియల్ మొత్తం దగ్ధమైంది. కోట్లాది రూపాయల్లో నష్టం వాటిల్లింది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరుకుని చుట్టు పక్కల ప్రజలను అప్రమత్తం చేశారు. మరోవైపు ఏలూరు - పెదపాడు మార్గంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరా యం లేకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఏసీ ఆన్‌చేయడంతో రసాయనాలు మండి ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. గోడౌన్ పక్కనే ఉన్న ఫంక్షన్ హాల్ ఏసీలు దగ్ధమయ్యాయి.

అనుమతి ఎలా ఇచ్చారు..?

జనావాసాల మధ్య, ఆసుపత్రి సమీపంలో రసాయనాలతో కూడిన పరుపుల తయారీ ఫ్యాక్టరీకి అనుమ తులు ఎలా ఇచ్చారని పరిశ్రమల శాఖ అధికారులను డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఫోన్‌లో ప్రశ్నించారు. తక్షణమే కమిటీ ఏర్పాటు చేసి ఎక్కడెక్కడ ఇలాంటి పరిశ్రమలు ఉన్నాయో తనిఖీ చేసి అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కంపెనీ ఉత్పత్తులకు లైసెన్సు, నిల్వ సామర్థ్యం, తయారీ అనుమతులపై డీఎస్పీ ఆరా తీశారు.



ఫ్యాక్టరీ నుంచి వెలువడిన మంట, పొగ



అనుమతులు పరిశీలిస్తాం

రెండు రోజుల్లో ప్రత్యేక చర్యలు

జిల్లాలో ప్రమాదకర వస్తువులు, కెమికల్స్ తయారీ పరిశ్రమలకు అనుమతుల పరిశీలనకు రెండు రోజుల్లో ప్రత్యేక చర్యలు చేపడతాం. జిల్లాలో మూడు నెలల్లో భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయి. అన్ని ప్రమాదాలను అధ్యయనం చేసిన జనవాసాల మధ్య, ఆసుపత్రి వద్ద అనుమతులను పరిశీలిస్తాం. ప్రమాదకరమైన ఫ్యాక్టరీలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

వి.రామకృష్ణ,
జిల్లా అదనపు అగ్నిమాపకశాఖ అధికారి

గురుకుల కళాశాల విద్యార్థిని మృతి

- మృతిపై అనుమానాలు • బంధువుల ఆందోళన • ఆర్డీవో విచారణ

భీమడోలు, జూలై 10(ఆంధ్రజ్యోతి):పోలసానపల్లి బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందింది. కళాశాలలో గురువారం మధ్యాహ్నం 3.30 గంటల వరకూ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అనంతరం సాయంత్రం ఈ సంఘటన చోటు చేసుకుంది. భీమడోలు శివారు అర్జావారిగూడెం గ్రామానికి చెందిన లేళ్ల మానస (16) అప్పటి వరకు తల్లిదండ్రులు మరియమ్మ రాజుతో ఉల్లాసంగా సమావేశంలో ఉందని చెబుతున్నారు. తర్వాత కొద్దిసేపటికే మృతి చెందినట్లు తెలియడంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. చున్నీతో ఉరివేసుకుని మృతి చెందినట్లుగా కళాశాల అధికారులు చెబుతుండగా తల్లిదండ్రులు, బంధువులు ఖండిస్తున్నారు. పాఠశాల అధికారులు, అధ్యాపకులు ఏదో చేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మానస అపస్మారక స్థితిలో ఉండడంతో కళాశాల యాజమాన్యం మానసను భీమడోలు ప్రభుత్వ సామాజిక వైద్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

గురుకుల కళాశాల విద్యార్థిని మానస మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమతో ఉల్లాసంగా గడిపిన కుమార్తె అంతలోనే ఎలా చనిపోతుందని తల్లిదండ్రులు, బంధువులు ప్రశ్నిస్తున్నారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలంటూ ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు.

పోలసానపల్లి గురుకుల కళాశాలలో విద్యార్థిని మృతి సంఘటన సమాచారం తెలుసుకున్న ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ విల్సన్, తహసీల్దార్ రమాదేవి కళాశాలను సందర్శించారు. తొలుత ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టిన బంధువులతో మాట్లాడారు. అనంతరం గురుకుల కళాశాలలో విచారణ నిర్వహించారు. బాలిక మృతిపై పూర్తి స్థాయి విచారణ చేస్తామని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు.



ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థిని బంధువులతో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్ (ఇన్‌సెట్) విద్యార్థిని మృతదేహం



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గుర్తించిన నిందితుల వివరాలు

పోలీసుల ఏఐ నిఘా

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నిఘా కెమెరాలను ఏర్పాటుతో 70 శాతం నేరాల నియంత్రణ అదుపు చేయగలిగామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను అదుపు చేయడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారాల నిఘా వ్యవస్థ సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎస్పీ తెలిపారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం సబ్ డివిజన్ల పరిధిలో పాత నేరస్తుల కదలికలపై పర్యవేక్షణ కొనసాగిస్తూ స్థానిక పోలీసు అధికారులకు తక్షణమే సమాచారం అందిస్తూ నిఘా ఉంచామన్నారు. జిల్లాలో 166 పాత నేరస్తులపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచడంతో వారి కదలికలు అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తున్నామన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్లు, షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. దీని వల్ల నేరానికి పాల్పడిన వారిని గుర్తించడంతో పాటు అదుపులోకి తీసుకోడానికి సీసీ ఫుటేజ్ ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో ప్రత్యేక కేసులలో సీసీటీవీ ఫుటేజ్‌ల ప్రాముఖ్యత పెరుగుతుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు.

దాడి చేసి సెల్ లాక్కుపోయారు

భీమవరం క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): వాకింగ్‌కు వెళ్లిన వ్యక్తిపై ఇద్దరు దాడి చేసి సెల్‌ఫోన్ లాక్కుపోయారు. వన్‌టౌన్ సీఐ ఎన్. నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం నల్లంవారి తోటకు చెందిన సుంకర ఏసుదాసు గురువారం ఉదయం వీరమ్మ పార్కులో వాకింగ్‌కు వెళ్లారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు అడ్రస్ అడిగారు. అడ్రస్ చెప్పే సమయంలో ఏసుదాసు జేబులో సెల్‌ఫోన్ లాక్కుని పారిపోయేందుకు ప్రయత్నించారు. అడ్డుకోవడంతో వారి వద్ద ఉన్న రెండు బ్లేడులను తీసి దాడి చేశారు. కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకుని వారిద్దరిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. వారు ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన పులిగోరి నాని, అనకాపల్లికి చెందిన షేక్ ఆలీషాగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగరాజు తెలిపారు.



సంఘటనా స్థలిలో ఆవుల కళేబరాలు

జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా

14 ఆవులు మృత్యువాత

దెందులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై వ్యాన్ బోల్తా పడి 14 ఆవులు మృత్యువాత పడ్డాయి. విశాఖపట్నం నుంచి గుంటూరు పశువుల సంతకు తరలిస్తుండగా వ్యాన్ బోల్తా పడడంతో వ్యాన్‌లో ఉన్న 30 ఆవులలో 14 ఆవులు మృతి చెందాయి. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి వెంకట చైతన్యకృష్ణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన పశువులను పరిశీలించారు. అనుమతి లేకుండా పశువులను సంతకు తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని, పోలీసులు నిత్యం తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. సీఐ రాజశేఖర్, ఎస్ఐ శివాజీ బీజేపీ నాయకులతో చర్చలు జరిపి అనుమతి లేకుండా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాన్ బోల్తా సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. చీకటి ప్రభుచౌదరి, శేఖర్, నాయకులు పాల్గొన్నారు

పథకం ప్రకారం మహిళను నరికి చంపాడు

కైకలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):పథకం ప్రకారం మహిళను కత్తితో నరికి చంపిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 8న పోతుమర్రు శివారు గొల్లగూడెంలో జరిగిన నంగెడ్డ వరలక్ష్మీదేవి హత్య కేసు వివరాలను గురువారం డీఎస్పీ తెలిపారు. వరలక్ష్మీదేవి ఇంటి ఎదురుగా ఉంటున్న కట్టా రామాంజనేయులు భార్య కృష్ణవేణి స్నేహంగా ఉండేవారు. బంటా మేస్త్రీ బండారి నాగమల్లేశ్వరరావుతో ఇంటి ఎదురుగా ఉన్న కృష్ణవేణిని వరలక్ష్మీదేవి ఫోన్‌లో మాట్లాడిస్తుంది. భార్య కృష్ణవేణి ప్రవర్తనపై అనుమానం కలిగిన రామాంజనేయులు నిలదీయడంతో వరలక్ష్మీదేవి ద్వారా బంటా మేస్త్రీతో మాట్లాడినట్లు చెప్పింది. ఈ నెల 7న వరలక్ష్మీదేవి, నాగమల్లేశ్వరరావును చంపాలని రామాంజనేయులు పథకం వేశాడు. ఈ నెల 8న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో భోజనం చేస్తున్న వరలక్ష్మీదేవిని కల్లు గీత కత్తితో నరికి హత్య చేశాడు. అక్కడి నుంచి నాగమల్లేశ్వరరావును చంపేందుకు వెళ్లి అతడు కనిపించకపోవడంతో పారిపోయాడు. గురువారం మధ్యాహ్నం ఉప్పుటేరు వద్ద రామాంజనేయులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అతడి వద్ద హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలైన దుస్తులను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లుగా తెలిపారు. పూర్తి విచారణతో సాక్ష్యాధారాలను కోర్టుకు అందించి శిక్ష పడేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్సై వెంకటేశ్వరరావు, ముదినేపల్లి, కైకలూరు రూరల్ ఎస్సైలు వీరభద్రరావు, వి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భార్య ప్రవర్తన భరించలేక భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి):భార్య ప్రవర్తనతో విసుగుచెందిన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తూర్పువీధికి చెందిన తేరా రఘు (26) హైదరాబాద్‌కు చెందిన మౌనికను 2017లో వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మే నెలలో కూలి పనులకు హైదరాబాద్‌కు వెళ్లాడు. 10 రోజుల క్రితం మౌనిక ఇద్దరు పిల్లలను ఏలూరు తీసుకువచ్చి రఘు తల్లికి అప్పగించి స్కూల్‌లో చేర్పించాలని చెప్పి హైదరాబాద్ వెళ్లిపోయింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని వారు ఉండే గదిలో రఘుని బయట తాళం వేసి మౌనిక వెళ్లిపోయింది. చివరికి ఏలూరులో తన సోదరుడు రాజుకు ఫోన్‌చేసి తన వద్ద ఒక్క రూపాయి కూడా లేదని, తన భార్య అన్నీ పట్టుకుని వెళ్లిపోయిందని చెప్పాడు. రాజు రూ.వెయ్యి ఫోన్‌పే చేయడంతో ఏలూరు వచ్చాడు. వారి ఇంటి పై భాగంలో రఘు వెళ్లి పడుకున్నాడు. తెల్లవారేటప్పటికి అక్కడే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నాణ్యతా ప్రమాణాలతో పాఠశాలల్లో విద్యాబోధన : ఘంటా

కామవరపుకోట, జూలై 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థుల నడవడికలను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చర్చలు జరపాలని, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యాబోధన జరపాలని చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పేర్కొన్నారు. గురువారం పాతూరు, కామవరపుకోట తదితర గ్రామాల్లోని పాఠశాలల వద్ద జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో చర్చలు జరిపారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



కొయ్యలగూడెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా మాదేటి సత్యనారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన రెండేళ్ల పాటు అధ్యక్షుడిగా కొనసాగుతారు. శనివారం ఆయన ప్రమాణస్వీ కారం చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ద్వారా పేదలకు తనవంతు సేవలందిస్తానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా రోటరీ ద్వారా ఎంతో మందికి సేవలందుతున్నట్టు పేర్కొన్నారు.

కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శికి ఎంపీ వినతి



ఏలూరుటూటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు(సీఎస్ఆర్ఎఫ్) మంజూరు చేయాలని కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి పంకజ్ జైన్‌కు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ కార్యాలయంలో పంకజ్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎంపీ మహేశ్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో అవసరమైన పరికరాలు సమకూర్చుకోవడానికి నిధులు కేంద్రం మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరుకు సంబంధించి అంచనాల నివేదికను కలెక్టర్ ద్వారా రూపొందించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని ఎంపీ తెలిపారు.

టీడీపీ కార్యకర్తలకు ప్రమాద బీమా ఎంతో ఉపయోగం

జంగారెడ్డిగూడెం, జూలై 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ ప్రమాద బీమా ఎంతో ఉపయోగపడుతుందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. గురువారం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త పాకనాటి పెద దుర్గారావు కుటుంబానికి రూ.5 లక్షల టీడీపీ ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే రోషన్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం 35 మంది మెప్మా ఆర్పీలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ట్యాబ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ, మెప్మా టీఎంసీ నాగమణి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, నాయకులు పరిమి సత్తిపండు,నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రావూరి కృష్ణ,కొప్పాక శ్రీనివాసరావు,బొబ్బర రాజ్‌పాల్ కుమార్,సాయిల సత్యనారాయణ,చెరుకూరి శ్రీధర్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో సీపీఎం రాష్ట్ర బృందం పర్యటన

జీలుగుమిల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో మిగులు భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆ భూముల్లో దళారులు లేకుండా చూడాలని సీపీఎం రాష్ట్ర బృందం డిమాండ్ చేసింది. జీలుగుమిల్లిలో గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఉమ్మడి జిల్లాల కార్యదర్శులు పర్యటించారు. తాటియాకులగూడెం, బర్రింకలపాడు, పి.అంకంపాలెం, పి.నారాయణపురం గ్రామాల్లో ఆర్అండ్ఆర్ మిగులు భూముల ప్రాంతాల్లో పర్యటించారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శులు బి.బలరాం, ఎ.రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం, ఏజెన్సీ మండలాల కార్యదర్శులు తెల్లం దుర్గారావు, తెల్లం రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, కారం భాస్కర్, చందు ఉన్నారు. జనసేన పార్టీ నుంచి కొందరు యువకులు సీపీఎంలో రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. సీపీఎం సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరామని ఎస్.సాయి, ఆర్.సత్యనారాయణ, ఆర్.రాము, ఎం.అఫ్రోస్ పేర్కొన్నారు.

అధ్వానంగా బస్ కాంప్లెక్స్.. కానరాని పారిశుధ్యం



పోలవరం, జూలై 10(ఆంధ్రజ్యోతి): పోలవరం మండల కేంద్రంలో బస్ కాం ప్లెక్స్ గోతులతో అధ్వానంగా మారింది. ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బంది సైతం బస్ కాంప్లెక్స్‌లోకి వెళ్లడానికి ఇష్టపడటం లేదు. రోడ్లపై సెంటర్‌లో బస్ షెల్టర్‌లో వేచి చూసి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. బస్ కాంప్లెక్స్‌లో వేచి ఉండే కుర్చీలు, సరైన విద్యుత్ దీపాలు లేక, బస్ కాంప్లెక్స్ ఆవరణ గోతులు, బురదలతో అధ్వానంగా మారింది. ఈ వర్షాకాలంలో బస్సులు కూడా నిలపడానికి గానీ బస్సులు ఎక్కడానికి గానీ బస్ కాంప్లెక్స్ ఆవరణ అనువుగా లేకపోవడంతో ప్రయాణికులు బస్ కాంప్లెక్స్‌కి వెళ్లడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్ కాంప్లెక్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని, బస్ కాంప్లెక్స్ ఆవరణలో పారిశుధ్యం, గోతులు సరిచేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కెమెరా సృష్టికర్త లూయీస్ డాగురే వర్ధంతి

జంగారెడ్డిగూడెం/టి.నర్సాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): కెమెరా సృష్టికర్త లూయీస్ డాగూరే వర్ధంతిని జంగారెడ్డిగూడెం ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర రెడ్డి, జగన్ డాగూరే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ నాయకులు సూరిబాబు, సోమరాజు, ప్రసాద్ పాల్గొన్నారు. టి.నర్సాపురంలో లూయిస్ డాగురే వర్ధంతి కార్యక్రమాల్లో యూనియన్ అధ్యక్షుడు వాసు, యూనియన్ ఉపాధ్యక్షుడు మహరాజ్, కార్యదర్శి ప్రసాద్, చందు, మహేశ్, ఈశ్వర్, రవివర్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సుపరిపాలనలో తొలిఅడుగు

ఏలూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఏలూరు రూరల్ మండలంలోని చాటపర్రు, తిమ్మారావుగూడెం, కోటేశ్వర దుర్గాపురం, మొండికోడు గ్రామాల్లో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పర్యటించారు. గ్రామస్థులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా ప్రజలకు అందించారు. ఎమ్మెల్యే సమక్షంలో పలువురు టీడీపీలో చేరగా, వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

మళ్లీ గాడిలో సంపద సృష్టి కేంద్రాలు



ఏలూరు రూరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నిర్వీర్యమైన సంపద సృష్టి కేంద్రాలను మళ్లీ గాడిలో పెట్టాలని టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో వృథాగా ఉన్న అన్ని సంపద సృష్టి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల పేరుతో వర్మీకంపోస్టు యూనిట్లను రూ.లక్షలు వ్యయం చేసి నిర్మించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో ఇవి చాలా గ్రామాల్లో వృథాగా పడి ఉన్నాయి. కాగా కూ టమి ప్రభుత్వం జిల్లాలో వృథాగా ఉన్న కేంద్రాలు, తిరిగి పునర్జీవం కల్పించేలా చర్యలు శ్రీకారం చుట్టింది. అప్పట్లో అరకొర నిర్మాణాలతో నిలిచిపోయి దాదాపు 535 పైగా కేంద్రాలను మరమత్తు పనులు చేపడుతుండగా, ప్రతీ మంగళ, బుధ, గురువారాల్లో మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ సిబ్బంది చెత్త నుంచి సంపద దృష్టి కేంద్రాలను సందర్శించాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

సంపద తయారీ కేంద్రాలకు పునర్జీవం..

జిల్లాలో చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని చెత్త నుంచి సంపద కేంద్రాల జిల్లా సమన్వయకర్త ప్రసంగి రాజు తెలిపారు. వృథాగా ఉన్న కేంద్రాలకు మరమ్మతులు చేపట్టడం, వంటి పనులు గ్రామ పంచాయతీలు చేస్తున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో 547 గ్రామ పంచాయితీలు ఉండగా ప్రస్తుతం 535 సంపద కేంద్రాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో సంపద తయారీ కేంద్రాలకు పునర్జీవనం వచ్చినట్లే.

చేయి తడపాల్సిందే!

(5వ పేజీ తరువాయి)

మామూళ్ల వసూలు బాధ్యతను స్వీకరించారన్న ఆరోపణలున్నాయి.

దొరికితే దొంగలు : వీఆర్వో, ఆర్ఐ పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో దొరికితే దొంగలు.. లేకపోతే దొరల్లా చెలామణీ అవుతున్నారు. 2023లో మండవల్లి ఆర్ఐ పద్మరోజా ల్యాండ్ పేరు మార్పు కోసం రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. ఇటీవల చాట్రాయిలో మహిళా తహసీల్దార్‌కు కలెక్టర్ వెట్రిసెల్వి 10 మెమోలు జారీ చేస్తే 8 మెమోల్లో ఆమెపై తీవ్ర ఆరోపణలు వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేశారు. ఇది జరిగి కొన్ని నెలలు కాకముందే నూజివీడు నియోజకవర్గంలో వివాదాస్పద తహసీల్దార్‌ను ఏరికోరి తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ : కొన్ని మండలాల్లో తహసీల్దార్లు ఆర్డీవో స్థాయిలో వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలను అమలు చేయాల్సిన డివిజన్, మండల స్థాయి అధికారులు పట్టుకోల్పోయిన స్థితిలో ఉన్నారు. జిల్లాలో తహసీల్దార్ పోస్టులు పదుల సంఖ్యలో.. డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు 15 వరకు ఖాళీగా ఉండడంతో పలు మండలాల్లో కిందిస్థాయిలో అవినీతి పెచ్చుమీరింది. జిల్లాస్థాయిలో సమీక్షలు పెద్దగా లేకపోవడంతో ఇష్టారాజ్యం అవుతోంది.



ఏలూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి



లింగపాలెంలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్



కలపర్రులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్

తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చండి

మెగా పీటీఎంలో విద్యార్థులకు పిలుపునిచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వి

దెందులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే కలెక్టర్‌ను అయ్యానని కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. దెందులూరులోని బాలికల వసతిగృహం జరిగిన మెగా పేరెంట్ సమావేశానికి కలెక్టర్ వెట్రి సెల్వి హాజరయ్యారు. పాఠశాల హెచ్ఎంలు పాకలపాటి శ్రీదేవి, పి.శారదమ్మల ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,368 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 140 కాలేజీల్లో విజయవంతంగా మెగా పేరేంట్-టీచర్స్ డే నిర్వహించామన్నారు.అనంతరం తల్లికివందనం లబ్ధిదారులతో మాట్లాడారు. కొవ్వలిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో మేగా పేరెంట్ -టీచర్స్ డే కార్యక్రమంలో ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తపన సంస్థల చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి, బిడా గణేశ్ పాల్గొన్నారు.

● ఏలూరు అర్బన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల్లో మెగా పీటీఎం 2.0ను నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన కలెక్టర్ వెట్రిసెల్వి గత టెన్త్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన బాలికలకు నగదు బహుమతులను అందజేశారు. ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్ఐవో యోహాన్, డీఐఈవో శేఖర్‌బాబు, తహసీల్దార్ గాయత్రి పాల్గొన్నారు. బీజీటీవో మున్సిపల్ సంస్కృత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో రిటైర్డ్ డీవైఈవో బాపూజీ, రిటైర్డ్ హెచ్ఎం వీరభద్రరావు, టీడీపీ నాయకులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

● పెదపాడు: కలపర్రు హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీలు గురువారం పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత పాల్గొన్నారు. బొప్పిడి కాశీబాబు, గుత్తా అనిల్, ఆగోళ్ళ కృష్ణారావు, సుబ్రహ్మణ్యం, ఇంఛార్జి హెచ్.ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : స్థానిక కరాటం కృష్ణమూర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్-టీచర్స్ సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్, పూర్వ విద్యార్థి కరాటం రాంబాబు పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి కార్యాచరణపై అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. రాజానగరం పాఠశాలలో ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, ఐటీడీఏ డీడీ శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పోలవరం : పోలవరం మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్ డే నిర్వహించారు. పూర్వ విద్యార్థి డాక్టర్ టి.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఉమావల్లి ప్రోత్సాహకం అందించారు. ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులుగా ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు.

● కామవరపుకోట: పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. కామవరపుకోట హైస్కూల్ వద్ద మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఏలూరి హరిరామకృష్ణ, ఎంపీడీవో సరళకుమారి, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, ఎస్ఎంసీ చైర్మన్ డాన్ బొబ్బిలి, ఎంఈవో సుబ్బారావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: స్థానిక జడ్పీ స్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి పాల్గొన్నారు. లక్ష్మీరమణి మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సర్పంచ్ స్వర్ణలత పాల్గొన్నారు.

● ఏలూరురూరల్: చాటపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా మెగా పేరెంట్స్ డే జరిగింది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రామానగర్ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ - టీచర్స్ కార్యక్రమానికి ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు.

● ఏలూరుటూటౌన్: రామచంద్రరావుపేట ఈదర సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్‌డేకి ఎమ్మెల్యే చంటి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్ తీసుకోవడం వలన అనార్థాలు జరుగుతాయని పోస్టర్ ఆవిష్కరించారు. మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు, హెచ్ఎం కుటుంబరావు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక హయగ్రీవ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల కంటే పిల్లల చదువుల పట్ల తల్లిదండ్రులే ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

● కుక్కునూరు: మండలంలో 70 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థులు రాజకీయ నాయకులు పాల్గొన్నారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో నరసింహారావు, టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు,జనసేన పార్టీ మండలాధ్యక్షుడు యుగంధర్, గోపాలకృష్ణ, వెంకన్నబాబు, బీజేపీ నాయకులు లక్ష్మణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో వినూత్న మార్పులు తీసుకొచ్చిందని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. గురువారం విద్యావికాస్ ప్రైవేటు పాఠశాల, జడ్పీ బాలుర హైస్కూల్లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం)లలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఒకేరోజు 44 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సమావేశాలు పెట్టి పాఠశాలల్లో ఉన్న సమస్యలపై చర్చించిన ఘనత విద్యాశాఖా మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు.

● జీలుగుమిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చదివించే విద్యార్థుల తల్లిదండ్రులు వారి చదువులపై తరచూ పాఠశాలకు వెళ్లి ఆరా తియ్యాలని ఎంపీటీసీ నాలి శ్రీను అన్నారు. పి.అంకంపాలెంలో జరిగిన సమావేశం ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. విద్యార్థుకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలపై ఉపాధ్యాయులు వివరించారు. సర్వేపల్లి రాధకృష్ణ కిట్లు అందజేశారు. పేరెంట్ కమిటీ సభ్యులు బండారు అనిల్‌కుమార్, ఏసేపు నాయుడు, అకిరెడ్డి ప్రసాద్, తదితరులు ఉన్నారు.

● కొయ్యలగూడెం: మండలంలో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాలు జరిగాయి. అన్ని పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. కొయ్యలగూడెం ప్రభుత్వ జడ్పీపాఠశాల, బయ్యన్నగూడెం, కన్నాపురం జడ్పీపాఠశాల, కనకాద్రిపురం ఎంపీపీ పాఠశాలలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, డీఎల్‌డీవో రాజు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పారేపల్లి నరేశ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ జేడీ ఆకస్మిక తనిఖీలు



షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఏలూరుసిటీ, జూలై 10(ఆంధ్రజ్యోతి): విశ్వసనీయ సమాచారం మేరకు నిషేధిత కలుపు మందులు గ్లైసెల్ (గ్లైఫోసెట్ 41శాతం ఎస్ఎల్) రైతులకు విక్రయిస్తున్నారని తెలిసి జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా తన బృందంతో ఏలూరు నగరంలోని గ్రీన్‌సిటీలో ఒక పురుగు మందుల షాపులో ఆకస్మిక తనిఖీలు గురువారం నిర్వహించారు. ఓషాపులో తనిఖీ చేయగా వాటిలో గ్లైసల్ 200 లీటర్ల మందు అక్రమ నిల్వలను గుర్తించారు. దాని విలువ రూ.1,78,500గా నిర్ధేశించుకున్నారు. వీటిని సి.హెచ్.గోవింద్ అనేవారు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. వీటికి సంబంధించి ఎలాంటి బిల్లులు అనుమతి పత్రాలు లేనట్టు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా అయినట్టు గుర్తించారు. అసలు సూత్రదారిని గుర్తించే క్రమంలో వ్యవసాయ శాఖాధికారులు నిమగ్నమయ్యారు. సదరు వ్యక్తి గతంలో పురుగుమందులు అమ్మే లైసెన్స్ పొంది ప్రభుత్వం అనుమతినిచ్చిన ప్రదేశంలో కాకుండా అనుమతి లేని రహస్య ప్రదేశంలో వీటిని విక్రయస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఈ కలుపుమందు గ్లైసెల్‌ను పంటలపై వినియోగించడాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఇది పూర్తి విషతుల్యం కలిగి మానవ, జంతు జాలాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందని, అనేక అనారోగ్య సమస్యలకు కారణం అవుతుందని దీనిని నిషేధించింది. నిషేధిత కలుపు మందు గ్లైసెల్‌తో పాటు ఇతర అనేక రకాల పురుగు మందులు ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్నట్టు సోదాల్లో బయటపడిందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా తెలిపారు. దాదాపు 870 కేజీల మందును గుర్తించామన్నారు. దీని విలువ రూ. 7.72 లక్షలని పేర్కొన్నారు. వెంటనే వ్యవసాయ శాఖాధికారులు రెవెన్యూ పంచనామా జరిపి కలుపు మందు, ఇతర పురుగుమందులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వ్యవసాయశాఖాధికారులు వాటి నమూనాలను సేకరించి నాణ్యత కొరకు ప్రయోగశాలకు పంపించారు. స్వాధీనం చేసుకున్న సరుకును తగు భద్రత నిమిత్తం రెవెన్యూ కస్టడీకి అప్పగించారని, సదరు వ్యక్తిపై పురుగుమందుల చట్టం 1968 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖాధికారి షేక్ హబీబ్‌బాషా తెలిపారు.

13 మంది తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడి



చిన్నారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

ఏలూరు క్రైం, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసీమియా భవనంలో 13 మంది చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్టు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పుట్టబోయే పిల్లలకు తలసీమియా, సికిల్‌సెల్, ఎనీమియా వ్యాధులు రాకుండా ఉండాలంటే పెళ్లి చేసుకోబోయే దంపతులు ముందుగానే కొన్ని రకాల జన్యు పరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. సలహాల కోసం ఏలూరులోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనాన్ని సంప్రదించవచ్చున్నారు. రెడ్‌క్రాస్ భవనంలో మూడు నెలలకు ఒకసారి తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా, హిమోఫిలియా వ్యాధులపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉషా గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత వీవీ బాలకృష్ణారావు, డాక్టర్ వర ప్రసాద్, చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఆల్బర్ట్, కమిటీ సభ్యులు ఎ.నాగేశ్వరరావు, అజయ్‌బాబు, ఎన్వీవీబీ స్వామి, రత్నాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం



పొత్తూరి నరసింహరాజును అభినందిస్తున్న దృశ్యం

నిడమర్రు, జూలై 10(ఆంధ్రజ్యోతి):ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన పొత్తూరి నరసింహరాజు పత్తేపురం సొసైటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం మండలంలో పత్తేపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పొత్తూరి నరసింహరాజు బాధ్యతలు స్వీకరించగా ఆప్కాబ్ చైర్మన్ గన్నితో పాటు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు హాజరై అభినందించారు. బీజేపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు శరణాల మాలతీరాణి, బాసిరాజు, వంగా రఘు, పత్సమట్ల భీమరాజు, ఆదిరెడ్డి చంద్రరావు, ముత్యాల స్వామి, పి.సింహాచలం పాల్గొన్నారు.

● పెదవేగి: పెదవేగి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా తాతా సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే కమిటీ సభ్యులు(పర్సన్)గా పోతురాజు రాటాలు, కొమ్మిన సతీశ్‌లు బాధ్యతలు చేపట్టారు. అలాగే కొప్పాక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా కొసరాజు వీరవెంకట వరప్రసాద్, సభ్యులుగా పరసా వీరాస్వామి, జి.ఏసుపాదంలు బాధ్యతలు చేపట్టారు. పెదవేగి సొసైటీలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సహకారంతో తాను చేపట్టిన చైర్మన్ పదవిని రైతుల సంక్షేమానికి ఉపయోగిస్తానని చెప్పారు. పెదవేగి సొసైటీ ప్రత్యేకాధికారిగా పనిచేసిన ఏఎస్.మూర్తి, సొసైటీ కార్యదర్శి ఆర్‌వీ.ప్రసాద్, గ్రామ సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, టీడీపీ పెదవేగి మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్‌కుమార్, కంచెన మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: బాదంపూడి, చేబ్రోలు సొసైటీ చైర్మన్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాదంపూడి సొసైటీ చైర్మన్‌గా వల్లభుని గణపతి, చేబ్రోలు సొసైటీ చైర్మన్‌గా కడియాల రవిశంకర్, బొట్టా దుర్గారావు, గౌతు బాలభాస్కరరావులు త్రిసభ్య కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

గురువుకు ఆత్మీయ సత్కారం



మధుసూదనరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

టి.నర్సాపురం: గుర్వాయిగూడెంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మండల బీజేపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో అధ్యాత్మిక గురువు ఆదూరి మధుసూదనరావు, ఏవీపీఎల్ శేషమాంబ దంపతులను గురువారం ఘనంగా సన్మానించారు. మధుసూదనరావు మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని పెంచేవ్యక్తి గురువని అన్నారు.



స్వాముల వద్ద ఆశీర్వచనాలు తీసుకుంటున్న చౌదరి

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

దెందులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి కారణంగా మండలంలోని సాయిబాబా ఆలయాలు గురువారం భక్తులతో కిటకిటలాడాయి. కొవ్వలి సాయిబాబా మందిరంలో ఆలయ ధర్మకర్త వడ్లపట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన సంస్థల అధినేత గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఉషా పిక్చర్స్ అధినేత వడ్లపట్ల వెంకట బాలకృష్ణారావు(ఉషాబాలకృష్ణ), ఆలయ చైర్మన్ వడ్లపట్ల శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పెదవేగి: గురువులేని విద్య అసంపూర్ణమని, వ్యక్తి అభివృద్ధి గురువుద్వారానే సాధ్యమని ఆశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతీస్వామి అన్నారు. పెదవేగి మండలం ముండూరు సమీపంలోని శ్రీయాజ్ఞవల్క్య రాజాశ్రమాన్ని సందర్శించిన తపనా చౌదరి, అక్కడ గురువులకు మొక్కి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. బీజేపీ దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్య పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి బాబా ఆలయాల్లో భక్తులు కిటకిటలాడారు. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లోని సాయిబాబాను ఆలయం వద్ద బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. బయ్యన్నగూడెం, గవరవరం, కన్నాపురం గ్రామాల్లోనూ ఘనంగా నిర్వహించారు.

● ద్వారకాతిరుమల: క్షేత్రంలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ గర్భాలయంలో కొలువైన సాయిబాబాను విశేషపుష్ప మాలికలతో అలంకరించారు.

● చింతలపూడి: షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి గురువారం జరిగింది. ఉదయం పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఈ అభిషేకాల్లో పాల్గొని పూజలు జరిపారు. సుమారు నాలుగు వేల మందికి అన్నసమారాధన జరిపారు. ఆలయ నిర్వాహకులు బవిరిశెట్టి నాగేశ్వరరావు, కొత్తపూడి శేషగిరిరావు పర్యవేక్షించారు.



గొడుగుపేటలో టీడీపీలో చేరిన నాయకులు

టీడీపీలో భారీగా చేరికలు

ద్వారకాతిరుమల, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలనకు ఆకర్షితులవుతున్న వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని గొడుగుపేటలో దాదాపు 10 కు టుంబాల వారు గురువారం రాత్రి వైసీపీ నుంచి టీడీపీ తీర్థంపుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే మద్దిపాటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మండలంలోని ఐ.ఎస్.జగన్నాథపురం, రాఘవాపురం, రామసింగవరం, జికొత్తపల్లి తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేషన్ దుకాణాల్లో సరుకుల పరిశీలన

వేలేరుపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాలను సివిల్ సప్లై డీటీ ఎన్.వి.రమణ గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో ముంపు గ్రామాలకు రేషన్‌సరుకులు రేషన్ షాపుల్లో నిల్వ చేశారు. దిగుమతి అయిన సరుకు తడవకుండా సక్రమంగా భద్రపరిచారా లేదా అని పరిశీలించేందుకు కోయిద, కటుకూరు, తిరుమలాపురం, రుద్రమ్మకోట, రేషన్ షాపులను తనిఖీ చేశారు. రేషన్ సరుకులను ప్రజలకు సక్రమంగా అందించేలా రేషన్ డీలర్లు పని చేయాలని డీలర్లకు సూచించారు. ఇందులో ఎటువంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు.

మండల పరిషత్ సమావేశం

పెదపాడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎంపీడీవోల అమీలు జమ, ఇవోపీఆర్డీ సూర్యకుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్‌లో వ్యాస జయంతి

ఏలూరు అర్బన్, జూలై 10(ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం వ్యాస జయంతిని నిర్వహించారు. కళాశాల సంస్కృత అధ్యాపకుడు డాకర్ రామకృష్ణ మాట్లాడుతూ వ్యాస మహర్షి జీవిత విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. భారతీయ సంస్కృతిలో వ్యాస జయంతి ఒక భాగమన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు వదిలిపెట్టండి

ఏలూరు అర్బన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : సెల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించి గ్రంథాలయంపై, విద్యావిషయాలపై అవగాహన పెంచుకోవాలని డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థినులకు గురువారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సుపీరియర్, మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండేజ్ సూచించారు. కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆమె మాట్లాడుతూ తొలి ఏడాదిలోనే లక్ష్యాలను నిర్ధేశించుకుని లక్ష్యసాధనకు కృషి చేయాలని కోరారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న కళాశాలలో మహిళా సాధికారతకు అగ్రప్రాధాన్యత ఉంటుందన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ సునీలరాణి, హిందీ, తెలుగు హెచ్‌వోడీ మహాలక్ష్మి, అధ్యాపకులు అరుణ, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నర్సాపురం, జూలై 10(ఆంధ్రజ్యోతి): నేడు విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. టి.నర్సాపురం, రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విజయరాయి సెక్షన్ పరిధిలో..

పెదవేగి, జూలై 10(ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ పరిధిలో జానంపేట విద్యుత్ ఉప కేంద్రంలో బ్రేకర్ ఎరక్షన్ కారణంగా జానంపేట, జగన్నాథపురం, బి.సింగవరం, ముత్తనవీడు గ్రామాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ విజ్ఞప్తి చేశారు.

నిడమర్రు సెక్షన్ పరిధిలో..

నిడమర్రు, జూలై 10(ఆంధ్రజ్యోతి) : నిడమర్రు సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెదనిండ్రకొలను, చిననిండ్రకొలను, నిడమర్రు, గుణపర్రు, ఛానమిల్లి, భువ్వనపల్లి, బావాయిపాలెం, క్రొవ్విడి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అంబేడ్కర్ తెలిపారు.

మూడు మండలాల పరిధిలో..

జీలుగుమిల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో పలు గ్రామాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్‌ను శుక్రవారం నిలిపివేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆయా మండలాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు రైతులు సహకరించాలన్నారు.

15న ఆలయ భూముల లీజుకు వేలం

ముదినేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి) :ముదినేపల్లి మండలం సింగరాయపాలెంలోని శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానానికి చెందిన ఎకరం చేపల చెరువు, అమృతేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 66 సెంట్ల చేపల చెరువు, 10.79 ఎకరాల పల్లపు భూములను లీజుకు ఇచ్చేందుకు ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తామని దేవస్థానాల ఈవో ఎ.కొండలరావు తెలిపారు. చేవూరు గ్రామ ఏరియాలోని భూముల లీజు వేలంను ఆ గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద నిర్వహిస్తామని తెలిపారు.

'పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చుకోవాలి'

ఆగిరిపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): దాణా ఖర్చును తగ్గించి పాడి పరిశ్రమను లాభదాయ కంగా మార్చుకోవాలని నూజివీడు పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ కె.నరసింహారావు అన్నారు. గురువారం పశుగ్రాసం వారోత్సవాలు పురస్కరించుకుని ఈదర పశువైద్యశాలలో పాడి రైతులకు పశుగ్రాసం, పంటల సాగు సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పశుగ్రాసం విత్తనాలు 75 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈదర పశువైద్యశాల అధికారి డాక్టర్ జి.శశివర్మ, పశువైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



కైకలూరు పంట కాలువ వద్ద కృష్ణమ్మకు పూజలు చేస్తున్న కూటమి నేతలు

కాలువల అభివృద్ధితో సురక్షితమైన తాగునీరు

కైకలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):కాలువల అభివృద్ధితో ప్రజలకు సురక్షితమైన తాగునీరును అందిస్తామని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. కైకలూరు పంట కాలువకు గురువారం నీరు విడుదలైన సందర్భంగా కైకలూరు-కోరుకొల్లు రోడ్డులోని వంతెన వద్ద కృష్ణమ్మకు పసుపు, కుంకుమలతో డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసీపీ హయాంలో ఒక్క కాలువను అభివృద్ధి చేయక పోవడంతో అస్తవ్యస్తంగా మారాయన్నారు. ప్రస్తుతం కాలువలను అభివృద్ధి చేయడం వల్ల ఎగువనుంచి నీరు పుష్కలంగా వస్తోందని, శివారు గ్రామాలకు సైతం సరఫరా చేస్తామని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు మంచినీటి చెరువులు నింపేందుకు సహకరించాలన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నేతలు పూల రాజీ, కేకే బాబు, ఎండీ జాని, కీర్తి వెంకటరాంప్రసాద్, కేవీఎస్‌ఎం నాయుడు, గంగుల ఏసురాజు, పడమటి వాసు, అధికారులు పాల్గొన్నారు.

పరుపుల తయారీ పరిశ్రమ దగ్ధం

ఏలూరు క్రైం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో పరుపుల తయారీ కంపెనీ, గొడౌన్ పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు సమీపంలోని కొత్తూరు రోడ్ వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి ఎదురుగా సుస్మిత ఫర్నీచర్ కుషనింగ్ సంస్థను శీలంశెట్టి రాజా, శీలంశెట్టి కిశోర్‌కుమార్, శీలంశెట్టి సంధ్య, కొండవీటి నీలిమ నిర్వహిస్తున్నారు. జ్యూట్‌మిల్లు గొడౌన్లు లీజుకు తీసుకుని పరుపుల తయారీ, స్పాంజ్, ఫోమ్, ఇతర షీట్లు తయారీ కొనసాగిస్తున్నారు. ఫ్యాక్టరీ నుంచి కార్మికులు వెళ్లిపోయిన తర్వాత బుధవారం రాత్రి ఇద్దరు వాచ్‌మెన్‌లు ఉన్నారు. స్పాంజ్, ఫోమ్ తయారీకి ఉపయోగించే రసాయనాలు కూలింగ్‌లో ఉంచాలి. ఈ రెండు ట్యాంకుల వద్ద పెద్ద ఏసీని గురువారం ఉదయం 6 గంటలకు వాచ్‌మెన్ ఆన్ చేశాడు. తర్వాత మెయిన్ గేటు వద్ద టిఫిన్ చేస్తుండగా 6.30 గంటల సమ యంలో లోపల నుంచి పొగలు రావడం గమనించారు. క్షణాల్లోనే స్పాంజ్, ఫోమ్ ఇతర కెమికల్స్ మండడంతో భారీ ఎత్తున పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న జిల్లా అదనపు అగ్నిమాపక శాఖఅధికారి వి.రామకృష్ణ రెండు ఫైర్ ఇంజన్లతో చేరుకున్నారు. మరోవైపు భీమడోలు, హనుమాన్ జంక్షన్, కైకలూరు ఫైర్ ఇంజన్లు కూడా రప్పించారు. మూడు గంటల పాటు ఐదు ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పుతూనే ఉన్నాయి. అప్పటికే గోడౌన్‌లో కెమికల్స్, ఫోమ్, పరుపులకు సంబంధించిన మెటీరియల్ మొత్తం దగ్ధమైంది. కోట్లాది రూపాయల్లో నష్టం వాటిల్లింది. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, సిబ్బంది అక్కడకు చేరు కుని చుట్టు పక్కల ప్రజలను అప్రమత్తం చేశారు.



కంపెనీ గొడౌన్ వద్ద దగ్ధమవుతున్న దృశ్యం



చినపాలపర్రు వద్ద దుక్కులు చేసేందుకు ఇంజన్‌తో నీటిని తోడుతున్న దృశ్యం



పెయ్యేరులో నారుమడికి వర్షపు నీటిని తోడుతున్న దృశ్యం

సార్వా సాగుకు నీటి ఎద్దడి

ముదినేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి):సార్వా సాగుకు నీటి ఎద్దడి తలెత్తింది. వర్షాలు లేక, కాలువల ద్వారా సరిపడినంత నీరు సరఫరా కాకపోవడంతో నారుమళ్లతోపాటు వరి నాట్లు వేసేందుకు సాగునీరు కరువైంది. పోల్‌రాజ్ కెనాల్, గుడివాడ చానల్ కింద ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల్లో సార్వా దుక్కులు చేసుకునేందుకు అవసరమైన నీటిని విడుదల చేయడం లేదు. గుడివాడ చానల్ శివారున ఉన్న ముదినేపల్లి మండలంలోని పెదపాలపర్రు, కోడూరు, చినపాలపర్రు, అత్తివానిచెరువు, ముదినేపల్లి గ్రామాలకు చెందిన ఆయకట్టుకు నీరందడం లేదు. నారుమళ్లను కాపాడుకునేందుకు, సార్వా దుక్కులు చేపట్టేందుకు రైతులు మురుగు కాల్వలు, పంట బోదెల నుంచి ఆయిల్ ఇంజన్లతో నీటిని పొలాలకు తోడుకుంటున్నారు. తొలిసారిగా వెదజల్లిన వరి పొలాలు భారీ వర్షాలకు ముంపునకు గురై పాడైపోగా, అదే భూముల్లో రెండోసారి నాట్లు వేసేందుకు సాగునీరు అందడం లేదు. పోల్‌రాజ్ కెనాల్ కింద పెయ్యేరు, దాకరం, ముదినేపల్లి, పెనుమల్లి, గురజ తదితర గ్రామాలకు చెందిన ఆయకట్టులో నీరందక వెదజల్లిన పొలాలు బీటలు వారాయి. పెయ్యేరులో నారుమళ్లకు ఇంజన్లతోనే పంట బోదెల నుంచి నీరు తోడుకుంటున్నారు. సార్వా నాట్లు వేయగలమా లేదా అన్న ఆందోళనకు రైతులు గురవుతున్నారు. చిపాలపర్రు రైతు బస్త్రాటి కుమార్ మాట్లాడుతూ కాల్వలకు నీరు విడుదల చేయకపోవడంతో నాట్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వరకు నీటిని తోడుకునేందుకు ఇంజన్లకు ఖర్చు అవుతోంది. సాగునీటి ఎద్దడిని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

చేయి తడపాల్సిందే !

(5వ పేజీ తరువాయి)

మామూళ్ల వసూలు బాధ్యతను స్వీకరించారన్న ఆరోపణలున్నాయి.

దొరికితే దొంగలు..


వీఆర్వో, ఆర్‌ఐ పనితీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో దొరికితే దొంగలు.. లేకపోతే దొరల్లా చెలామణి అవుతున్నారు. 2023లో మండవల్లి ఆర్‌ఐ పద్మరోజా ల్యాండ్ పేరు మార్పు కోసం రూ.50వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారు. ఇటీవల చాట్రాయిలో మహిళా తహసీల్దార్‌కు కలెక్టర్ వెట్రిసెల్వి 10 మెమోలు జారీ చేస్తే 8 మెమోల్లో ఆమెపై తీవ్ర ఆరోపణలు వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేశారు. ఇది జరిగి కొన్ని నెలలు కాకముందే నూజివీడు నియోజకవర్గంలో వివాదాస్పద తహసీల్దార్‌ను ఏరికోరి తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

కొన్ని మండలాల్లో తహసీల్దార్లు ఆర్డీవో స్థాయిలో వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాలను అమలు చేయాల్సిన డివిజన్, మండల స్థాయి అధికారులు పట్టుకోల్పోయిన స్థితిలో ఉన్నారు. జిల్లాలో తహసీల్దార్ పోస్టులు పదుల సంఖ్యలో.. డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు 15 వరకు ఖాళీగా ఉండడంతో పలు మండలాల్లో కిందిస్థాయిలో అవినీతి పెచ్చుమీరింది. జిల్లాస్థాయిలో సమీక్షలు పెద్దగా లేకపోవడంతో ఇష్టారాజ్యం అవుతోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



నూజివీడు ఎస్‌ఆర్‌ఆర్ బాలుర హైస్కూల్లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి



ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లి స్కూల్లో విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న వేణు, తదితరులు



కైకలూరులో విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ



కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో తల్లికి వందనం కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లులు

విద్యావ్యవస్థ ప్రక్షాళన చేస్తాం

» మంత్రి పార్థసారథి
» పండుగలా 'మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు'

నూజివీడు, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం పలు సంస్కరణలు అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు ఎస్‌ఆర్‌ఆర్ బాలుర పాఠశాలలో గురువారం నిర్వహించిన 'మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్'లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ప్రమాణాలను పెంచే గొప్ప ఉద్దేశ్యంతో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.విద్యా బోధనలో ప్రధాన సమస్య పరిష్కారానికి ప్రతీ తరగతి గదికి ఉపాధ్యాయులు ఉండేలా 16,327 ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్‌ఆర్ పాఠశాల మరమ్మ తులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతోపాటు, సత్ప్రవర్తన, నైతిక విలువలు పెంచేలా ఉపాధ్యాయులు శిక్షణ అందించాలన్నారు. అనంతరం టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్.కళ్యాణహర్షకు మెమెంటో, రూ.10వేల నగదు అందించి మంత్రి సత్కరించారు. అనంతరం విద్యార్థులు, తల్లితండ్రులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి తిల కించి అభినందించారు.

విద్యార్థులతో కలిసి భోజనం..

పాఠశాల ఆవరణలో డొక్కా సీతారా వమ్మ బడి భోజనం కార్యక్రమంలో భాగంగా మెస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనంలో ఏదైనా పొరపాట్లు జరిగినప్పుడు సబ్ కలెక్టర్, తహసీల్దార్ తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

● ఆగిరిపల్లి:ఆగిరిపల్లి మండల వ్యాప్తంగా అన్ని యాజయాన్య పాఠశా లల్లో గురువారం మెగా పేరెంట్స్ మీట్‌లో 7,776 మంది విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం పి.పుష్పలత అధ్యక్షతన ముఖ్యఅతిథిగా ఎంపీడీవో భార్గవి, ఎంపీడీవో కొవ్వలి ఆనంద్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు పాల్గొన్నారు. విద్యా కమిటీ చైర్మన్ ఆవుల నరేష్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లిపర సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు. బొద్దనపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్లో విజయవాడ వాస్తవ్యులు సునీల్ చౌదరి వారి కుమార్తె ఖుసి చౌదరి, రిటైర్డ్ పోస్ట్‌మన్ ఆర్.రామచంద్రరావు దాతలు అందించిన స్టీల్ వాటర్ బాటిల్స్, నోటు పుస్తకా లను విద్యార్థులకు పంపిణీ చేశారు.

● ముసునూరు : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని టీడీ పీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ ప్రముఖులు, పాఠశాల అభివృద్ధి ప్రదాత దేవినేని వరప్రసాదరావు అన్నారు. గురువారం ముసునూరు జడ్పీ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో రఘుబాబు మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం అంది స్తున్న దేవినేని వరప్రసాదరావుకు కృతజ్ఞతలు తెలిపి.. పాదాభివందనం చేశారు. గురుకుల బాలికల పాఠశాలలో జరిగిన పేరెంట్స్ సమావేశంలో సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, డీసీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

● చాట్రాయి : చాట్రాయి మండలంలో 62 ప్రభుత్వ, 6 ప్రైవేటు, ఒక ప్రైవేటు జూనియర్ కాలేజి మొత్తం 69 విద్యాలయాల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు వేడుకగా జరి గాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తల్లులకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజే శారు. ఎంఈవో బ్రహ్మచారి, టీడీపీ నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, ఇజ్జిగాని వెంకటేశ్వ రరావు, పానుగళ్ల కోటేశ్వరరావు, నక్కా రాము, నేబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి మంత్రి సారథి చేయూత

నూజివీడుకు చెందిన సత్తిబాబు గాయత్రి కుమారుడు మహేష్, తూర్పుగోదావరి జిల్లా జగ్గయ్యపేటలో ఒక ప్రైవే టు పాఠశాలలో ఐదో తరగతి చదివాడు. ఆర్థిక స్తోమత లేక ఫీజు చెల్లించలేకపోవడంతో పాఠశాల యాజమాన్యం టీసీ ఇవ్వలేదు. తల్లిదండ్రులు గురువారం నూజివీడు ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్ ఆవరణలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో మంత్రిని కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన మంత్రి సదరు పాఠశాల యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి టీసీ ఇప్పించేలా ఒప్పించారు. అ విద్యార్థిని నూజివీడు ఎస్‌ఆర్ ఆర్ బాలుర పాఠశాలలో ఆరో తరగతిలో చేర్పించేందుకు హెచ్‌ఎంతో మాట్లాడి జాయిన్ చేయించారు. అనంతరం పుస్తకాలు, వస్త్రాలకు రూ.5 వేలను సొంత నగదు అంద జేశారు. ఈ మేరకు తల్లిదండ్రులు మంత్రి సారథికి కృతజ్ఞ తలు తెలిపారు.

కైకలూరు నియోజకవర్గంలో..

● కైకలూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో విద్యార్థులు ఉన్నత విద్యను అందుకో వాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. గురువారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఓరియంటల్ హైస్కూల్లో, బాలికల హైస్కూల్లో, మండలంలోని అన్ని జడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు పాల్గొన్నారు. హెచ్‌ఎం వినోదిని, ప్రిన్సిపాల్ జ్యోతి, వైఎస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, ఆటపాక సర్పంచ్ తలారి మణి, ఎంపీటీసీ పట్టపు బాలమ్మ, కూటమి నేతలు ఎండీ జాని, వేల్పూరి చంద్ర య్య, సయ్యద్ బాషీద్, తదితరులు పాల్గొన్నారు.

● మండవల్లి: తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో రత్నసునాదం తెలిపారు. అయ్యవారి రుద్రవరం మండల పరిషత్ ప్రైమరీ పాఠశాలలో హెచ్‌ఎం పిచ్చయ్య అధ్యక్షతన ఘనంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు గ్రామ సర్పంచ్ బోనం శేషగిరి, ఎంపీటీసీ సభ్యులు సీహెచ్ శ్రీకృష్ణ బహుమతులు అందజేశారు.

● కలిదిండి : కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో పీటీఎంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు వందనం చేశారు. పలు ఆటల పోటీలు నిర్వ హించారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రు లకు తాడులాగుడు పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం స్వర్ణకుమారి మాట్లాడారు. ఆరుతెగలపాడు, పెదలంక, భాస్కరావుపేట, తాడినాడ, కోరుకొల్లు జడ్పీ హైస్కూళ్లలో మెగా పేరెంట్స్ డే నిర్వహించారు. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుగుణ డిగ్రీ కళాశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు.

● ముదినేపల్లి : మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాలొ న్నారు. ముదినేపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన పీటీఎం కార్యక్రమాల్లో నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ యు. గాలిబాబు, హెచ్‌ఎం విజయకుమార్, జూనియ ర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. సమావేశాలకు వచ్చిన తల్లిదం డ్రులను విద్యార్థులు ఆహ్వానించి, పాదాభి వందనం చేశారు. ఎంఈవో-1 డి.రామారావు, ఎంఈవో-2 నరేష్ కుమార్ పర్యవేక్షణలో మెగా పీటీఎంలు జరిగాయి.



కొర్లకుంటలో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ముసునూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి):పేదలకు సంక్షేమ ఫలా లను అందించి, ఆర్థికాభివృద్ధి మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు ఆవుల బాబూరావు అన్నారు. గురువారం కొర్లకుంటలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.



బొమ్మినంపాడు పీఏసీఎస్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

ముదినేపల్లి, జూలై 10(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు, వాడవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల త్రి సభ్య కమిటీలు గురువారం ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టాయి. బొమ్మినంపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా కరేటి లక్ష్మీ చిత్తరంజన్‌దాసు, సభ్యులుగా బొప్పన సుందరరామయ్య, వై.రాజేంద్రప్రసాద్, వాడవల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ముమ్మడిశెట్టి గోవ ర్ధనరావు, సభ్యులుగా పి.శ్రీహరి, పి.సాయిరాం ప్రమాణ స్వీకరాం చేశారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కేనం ప్రసాద్, టీడీపీ, జనసే న నాయకులు ఆంటోని, కోట జగన్, బాసినశెట్టి కిషోర్, వేల్పూరి నానాజీ, సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.

ఆక్వా ఉత్పత్తుల్లో మరిన్ని దిగుబడులు సాధించాలి

కైకలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ఆక్వా ఉత్పత్తుల్లో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా ఉందని మరిన్ని దిగుబడులను సాధించాలని జిల్లా మత్స్యశాఖ అధికారి నరసయ్య అన్నారు. గురువారం జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని కైకలూరు మత్స్యశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏడాది జూలై 10వ తేదీన డాక్టర్ హీరాలాల్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా జాతీయ చేపలరైతుల దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు. మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్, పలు మత్స్యశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీకి ట్యాంకర్లతో నీటి సరఫరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 'సచివాలయం తలు పులు మూసి.. ఖాళీ బిందెలతో ఆందోళన' అనే శీర్షికతో ఆంధ్రజ్యో తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఎంపీడీవో బీపీ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ రమణ క్కపేట ఎస్సీ కాలనీలో మరమతుకు గురైన మంచినీటి బోరు విద్యు త్ మోటారును పరిశీలించారు. ప్రత్యామ్నాయంగా కాలనీ వాసులకు ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు. త్వరలో మోటారు బిగించి, నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.



ట్యాంకర్‌తో నీటిని అందిస్తున్న అధికారులు

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు





కైకలూరులో శ్రీచక్రయజ్ఞాన్ని నిర్వహిస్తున్న శ్రీపరమోజీ, భక్తులు.. సత్యకృష్ణదత్‌కు సన్మానం

కైకలూరు/మండవల్లి/ముదినేపల్లి, జూలై 10 (ఆంధ్ర జ్యోతి): కైకలూరు మండలంలో గురుపౌర్ణమి వేడుకల ను ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువారం కైకలూరు సీఎస్నార్ గార్డెన్లో ఓమ్‌జయః ఏకపసాన మహాధర్మం ఆధ్వ ర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిం చారు. జై మహావిభోశ్రీ తన సత్సంగాన్ని లైవ్ ద్వారా ప్రజలకు వివరించారు. కైకలూరులో ప్రధాన శిష్యులు శ్రీపరమోజీ ఆధ్వర్యంలో మహాలక్ష్మీ మహాగురు శ్రీచక్రయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. షిర్డిసాయి ధ్యాన మందిరాల్లో బాబాకు విశేషపూజలు చేశారు. ధ్యానామందిరం అధ్యక్షుడు కొనిజేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. పేదలకు దుస్తులు, విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆషాడ పౌర్ణమి వ్యాసజయంతిని ప్రిన్సిపాల్ వై.శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండవల్లి మండలం మండవల్లిలో శ్రీదత్త పరంపర షిరిడీ సాయిబాబా మందిరంలో సాముహిక సత్యసాయి వ్రతం నిర్వహించారు. వందలాది మంది పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలోని షిర్డిసాయి బాబా మందిరంలో బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం హారతులు ఇచ్చి భక్తులు పూజలు జరిపారు. వణుదుర్రు రాధాకృష్ణ ఆశ్రమం అధిపతి వెంకన్నస్వామిని మందిర కమిటీ ఘనంగా సత్కరించింది.

నూజివీడు నియోజకవర్గంలో..

నూజివీడు టౌన్/ చాట్రాయి/ముసునూరు/ ఆగిరిపల్లి: బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షు రాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నృత్య సంగీత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేంపాటి మోహన్‌రావును, తబలా వాయిద్య కళాకారుడు వి మురళీ, యోగాకుమార్‌ను మల్లెపూడి రాణి, పార్టీ నాయకులు సత్కరించారు. పార్టీ నాయకులు ఎం. రాజశేఖర్, మాటూరి ప్రసాద్, శివరాజు, వసుంధరాదేవి, దోసపాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలంలో చాట్రాయి, సోమవరం గ్రామాల్లో షిర్డిసాయి ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. సోమవరం షిరిడీ సాయి ఆలయంలో అన్నసమారాధన జరిగింది. ముసునూరు మండలంలో అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయాల చైర్మన్‌లు పోలవరపు నరసింహారావు, కొత్తగుంట్ల శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబశ్ళ లక్ష్మీ సత్యనారాయణ, కమిటీ సభ్యులు, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నసమారాధనలకు భక్తులు తరలివచ్చారు. ఆగిరిపల్లి మండలం శోభనాద్రి లక్ష్మీ నరసింహ వేదశాస్త్ర పాఠశాలలోని వేద అధ్యాపకులను సత్కరించి సన్మానించారు. గురువులను గౌర వించడం దేశ ప్రజల సంస్కృతి సంప్రదాయం అని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గంగవెల్లి రామకృష్ణ రంగారావు (జీఆర్‌కే) అన్నారు. వేదా ధ్యయనం చేస్తున్న విద్యార్థులకు బోధిస్తున్న కృష్ణ యజుర్వేద ఘనాపాటి శ్రీసత్యకృష్ణదత్‌కు నమస్కారాలు అందజేసి సత్కరించారు. బీజేపీ మండల కన్వీనర్ సంగా రంగారావు, కోకన్వీనర్ మొగదాటి వెంకటేశ్వరరావు, రెడ్డిస్వామి, సూరి శర్మ, సూరనేని పార్థసారథి, కొవ్వూరు నాగరాజు, దొప్పల నాగేశ్ పాల్గొన్నారు.

రాగి వైరు దొంగ పట్టివేత

నూజివీడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నూజి వీడు శివారులోని రాజరాజేశ్వరి బ్రిక్స్ తయారీ కర్మాగారంలో బుధవారం రాత్రి రాగి వైరును దొంగిలించేందుకు ప్రయత్నించిన తుమ్ము కాటం రాజు అనే వ్యక్తిని కర్మాగారంలోని కార్మికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందిం చారు. ఇదే కర్మాగారంలో పదిరోజుల క్రితం 60 మీటర్ల రాగి వైరును కత్తిరించి తస్కరించిన ఘటన జరిగింది. మళ్లీ బుధవారం రాత్రి దొంగ తనానికి ప్రయత్నిస్తున్న సమయంలో అప్రమ త్తంగా ఉన్న కార్మికులు దొంగను బంధించి పోలీ సులకు సమాచారం అందించగా పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలిం చారు. అతడు స్థానిక రామారావుపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ రాగి వైర్లను సదరు దొంగలు ఎవరికి అమ్ముతున్నారో పోలీసులు సమాచారం సేకరించి చర్యలు తీసుకున్నప్పుడే దొంగతనాలు నియంత్రించబడతాయని పోలీసు లకు రైతులు విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కైకలూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మరమ్మ తుల నిమిత్తం పలు సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. చిగురుకోట సబ్ స్టేషన్ పరిధిలోని పోతుమర్రు, కలిదిండి, కాళ్ళ పాలెం, కోరుకొల్లు, వరహాపట్నం సబ్‌స్టేషన్లకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు నిలిపివేయబడుతుందన్నారు. గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదా రులు సహకరించాలని కోరారు.

ముందస్తు ప్రణాళికతోనే మహిళ హత్య : డీఎస్పీ

కైకలూరు, జూలై10(ఆంధ్రజ్యోతి): ముందస్తు ప్రణాళికతోనే మహిళపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం కైకలూరు సర్కిల్ కార్యాలయంలో ఈనెల 8న కలిదిండి మండలం పోతుమర్రు శివారు గొల్ల గూడెంలో జరిగిన నంగెడ్డ వరలక్ష్మీదేవి హత్య వివరాలను వెల్లడించారు. మృతురాలు వరలక్ష్మీదేవి ఇంటికి ఎదురుగా ఉంటున్న కట్టా రామాంజనేయులు, అతడి భార్య కృష్ణవేణి స్నేహంగా ఉండేవారు. కొంతకాలంగా వరలక్ష్మీదేవి కూలి పనులకు వెళుతుంది. ఈక్రమంలో బంటా మేస్త్రీ బండారి నాగమల్లేశ్వరరావుతో మృతురాలు ఇంటి ఎదురుగా ఉన్న కృష్ణవేణితో ఫోన్లో మాట్లాడిస్తుంది. భార్య కృష్ణవేణి ప్రవర్తనపై అనుమానం కలిగిన రామాంజనేయులు నిలదీయగా ఇంటి ఎదురుగా ఉన్న వరలక్ష్మీదేవి ఫోన్ ద్వారా మేస్త్రీతో మాట్లాడిస్తున్నట్టుగా వెల్లడించింది. ఈమేరకు కక్ష పెంచుకున్న అతడు ఈనెల 7వ తేదీన వరలక్ష్మీదేవిని, నాగమల్లేశ్వరరావును చంపాలని పథకం రచించాడు. తనవద్ద ఉన్న కల్లు గీత కత్తితో 8వ తేదీన నాగమల్లేశ్వరరావును చంపేందుకు ప్రయత్నించగా అతడు కనిపించకపోవడంతో ఇంటికి ఎదురుగా ఉన్న వరలక్ష్మీదేవిని కత్తితో నరికి హత్య చేశాడు. అనంతరం నాగమల్లేశ్వ రరావును చంపేందుకు వెళ్లగా కనిపించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి బృందాలుగా రామాంజనేయులు కోసం గాలింపు చేశారు. గురువారం మధ్యాహ్నం కైకలూరు మండలం ఉప్పుటేరు వద్ద అతడిని అరెస్టు చేశామన్నారు. హత్యకు ఉపయోగించిన కత్తి, రక్తపు మరకలైన దుస్తులను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిని కోర్టుకు హాజరుపరిచి శిక్షపడేలా చేస్తామన్నారు. రూరల్ సీఐ వి. రవికుమార్, కలిదిండి ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, ముదినేపల్లి, కైకలూరు రూరల్ ఎస్‌ఐలు వీరభద్రరావు, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

రోడ్ల పక్కన చెత్త వేయవద్దు

చాట్రాయి, జూలై 10(ఆంధ్రజ్యోతి): చాట్రా యిలో వ్యాపార సంస్థలు, దుకాణాల నుంచి గురువారం మండల స్పెషలాఫీసర్ వెంకట రత్నం, ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది తడి, పొడి చెత్త సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు వ్యాపారులతో మాట్లాడుతూ తడి పొడి చెత్త ప్లాస్టిక్ డబ్బాలలో ఉంచి చెత్త బండిలో వేయా లని సూచించారు. రోడ్ల పక్కన పారేయవద్దని విజ్ఞప్తి చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎంపీఎస్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.